
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM

శుక్రవారం, 14 మార్చి 2025



# రంగుల కేళి

## నేడు హోలీ.. వేడుకలకు సర్వం సిద్ధం

- సహజ సిద్ధమైన రంగులనే వినియోగించాలంటున్న వైద్యులు
- సంప్రదాయబద్ధంగా కామదహనం

ఖమ్మం ఖానాపురంహవేలీ/ కొత్తగూడెం సాంస్కృతికం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రంగుల కేళి హోలీ వేడుకలకు వేళైంది. హోలీ అనగానే ముందుగా గుర్తుకొచ్చేవి రంగులు.. ఐక్యత, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే ఈ పండుగ వేళ చిన్నాపెద్దా తేడా లేకుండా రంగులు జల్లుకుంటూ వసంతోత్సవాన్ని నిర్వహిస్తారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా అందరూ హోలీ వేడుకల్లో పాల్గొంటారు. పల్లెల్లో యువత పండుగకు రెండు రోజుల ముందే మోదుగు పూలను తీసుకొచ్చి ఎండబెట్టి నీటిలో నానబెట్టి రంగులను తయారు చేసుకొని ఒకరిపై ఒకరు జల్లుకుంటారు. ఈ ఏడాది హోలీ పౌర్ణమి తిథి రెండు రోజులు రావటంతో హోలీ రెండు రోజులు జరుపుకోనున్నారు. ప్రభుత్వం శుక్రవారం సెలవు ప్రకటించటంతో కొందరు శుక్రవారం, మరికొందరు శనివారం హోలీ నిర్వహించనున్నారు. హోలీ పండుగ సందర్భంగా జిల్లాలోని పలు అంకమ్మతల్లి ఆలయాల్లో మూడు రోజులపాటు జాతర నిర్వహించనున్నారు. ఖమ్మం నగరంలోని ఇల్లెందురోడ్ పారిశ్రామిక ప్రాంతంలోని అంకమ్మతల్లి ఆలయంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక ఉత్సవాలు జరగనున్నాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి బోనాలు సమర్పించనున్నారు.

**కామదహనం**

హోలీ పండుగకు ఒక రోజు ముందు రాత్రి జిల్లా వ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల వద్ద కట్టెలు పేర్చి కాముడిని దహనం చేశారు. గ్రామాల్లో చిన్నారులు కర్రలతో కోలాటం ఆడుతూ చందాలు వసూలు చేశారు. కొత్తగూడెంలోని రామటాకీస్ ఏరియాల్లోని రాజీవ్‌పార్క్ వద్ద హోలీ వేడుకలకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సంప్రదాయ పద్ధతిలో గురువారం రాత్రి మర్వాడీలు, పరదేశీ కులస్థులు కొత్తగూడెం కూలీలైన్ ఏరియాలో కామదహనం చేసి, ఒకరికొకరు రంగులు పులుముకుని సందడి చేశారు.

**సహజ సిద్ధమైన రంగులతోనే ఆరోగ్యం**

గతంలో రంగుల హోలీ పండుగను సహజసిద్ధమైన రంగులతో ఆనందోత్సావాలతో జరుపుకొనే వారు. ప్రకృతిలో లభించే వివిధ పూల నుంచి వెలువడే రంగులను సేకరించి ఎండబెట్టి పొడిగా చేసి నీటిలో కలిపి వాటితో హోలీ జరుపుకొనే వారు. అలాంటి రంగులతో ఆరోగ్యం.. ఆనందం కలుగుతుందని వైద్యులు, పర్యావరణ ప్రేమికులు సూచిస్తున్నారు. కానీ మారుతున్న కాలంలో ఎక్కువమంది రసాయనిక రంగులను హోలీ వేడుకల్లో వినియోగిస్తున్నారు. దీంతో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో సహజ సిద్ధమైన రంగులనే హోలీ వేడుకల్లో వినియోగించాలని వైద్యులు సూచిస్తున్నారు.



ఖమ్మం నిజాంపేటలో కామదహనం

## రేపటి నుంచి ఒంటిపూట బడులు

- పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ఖమ్మం ఖానాపురంహవేలీ/కొత్తగూడెం అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలకు 15వ తేదీ నుంచి ఏప్రిల్ 23వరకు ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం డీఈవోలు సోమశేఖర శర్మ, వెంకటేశ్వరచారి అన్ని పాఠశాలల యాజమాన్యాలకు ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు తరగతులు నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం 12:30 గంటలకు మధ్యాహ్న భోజనం అందించాలని తెలిపారు. పదో తరగతి పరీక్షా కేంద్రాలు ఉన్న పాఠశాలలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తప్పనిసరిగా ఆదేశాలు పాటించాలని ఆదేశించారు. ఇక వార్షిక పరీక్షల నేపథ్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. పలు సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతుల ద్వారా అభ్యసన సామర్థ్యాలను పెంచనున్నారు. ఈ విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు విద్యాశాఖ కృషి చేస్తోందని డీఈవోలు తెలిపారు.

## 1 నుంచి ధాన్యం కొనుగోళ్లకు సన్నాహాలు

- 2.50 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణే లక్ష్యం
- జిల్లాలో ఆశాజనకంగా యాసంగి సాగు

ఖమ్మం, మార్చి 13 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు ప్రారంభించింది. నాగార్జునసాగర్ ద్వారా కృష్ణాజలాలు, సీతారామ ప్రాజెక్టు పరిధిలోని ఏన్కూరు లింక్‌కెనాల్ ద్వారా గోదావరి జలాలు అందుతున్న నేపథ్యంలో ఈ ఏడాది యాసంగి (మిగతా 6వ పేజీలో)



కలెక్టర్‌తో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- భూసేకరణ, విద్యుత్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి
- నమ్మకంతో భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయాలి
- ఆగస్టు నాటికి యాతాలకుంట టన్నెల్ పనులు పూర్తి చేయాలి
- సీతారామ ప్రాజెక్టు సమీక్షలో మంత్రి తుమ్మల
- ట్రాక్టర్‌పై టన్నెల్‌లోకి వెళ్లి పనుల పరిశీలన





టన్నెల్‌లో ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి తుమ్మల

సత్తుపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి టన్నెల్స్ నిర్మాణం, కాలువల తవ్వకాలు, భూసేకరణ, పరిహారం, విద్యుత్ తదితర సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. సత్తుపల్లి మండలం యాతాలకుంట టన్నెల్ పనులను గురువారం ఆయన స్వయంగా ట్రాక్టర్‌పై వెళ్లి పరిశీలించారు. అనంతరం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల కలెక్టర్లు జితేష్ వీ పాటిల్, ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామ ఎస్‌ఈ పనుల పురోగతిని మ్యాప్ ద్వారా వివరించారు. టన్నెల్ నిర్మాణ పనులు 700 మీటర్లు జరగాల్సి ఉందని ఎస్‌ఈ తుమ్మల దృష్టికి తెచ్చారు. కొన్నిచోట్ల భూసేకరణ సమస్య ఉందని, మరికొన్ని ప్రాంతాల్లో విద్యుత్‌లైన్లు మార్చాల్సి ఉందన్నారు. భూసేకరణ జరిగిన ప్రాంతంలో ఎర్రచందనం చెట్లు ఉన్నాయని, వీటిని తొలగించేందుకు అనుమతులు రావాల్సి ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ విద్యుత్‌లైన్లు మార్చే విషయంలో విద్యుత్ శాఖకు డబ్బులు చెల్లించాల్సి ఉన్నా వాటికోసం ఎదురుచూడకుండా విద్యుత్ అధికారులు లైన్లను మార్చాలని సూచించారు. శాఖాపరంగా రావాల్సిన డబ్బులు ప్రభుత్వపరంగా వస్తాయని తెలిపారు టన్నెల్ నిర్మాణాన్ని ఆగస్టు నాటికి పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యానవన శాఖకు సంబంధించి ఆయిల్‌ఫామ్ మొక్కలకు పరిహారం చెల్లించే విషయంపై తుమ్మల మాట్లాడుతూ ఏపీలో ఇచ్చినట్లే పరిహారం ఇక్కడ కూడా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆ మేరకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. భూసేకరణ సమస్యను అధికారులు తక్షణమే పరిష్కరించాలని, ఎటువంటి జాప్యం జరగకూడదని ఆదేశించారు. ఇప్పటికే కొన్నిచోట్ల పరిహారం కోసం పట్టుబట్టకుండా రైతులు ప్రభుత్వంపై నమ్మకంతో భూములు ఇచ్చారని, అధికారులు రైతుల్లో నమ్మకాన్ని కోల్పోయేలా చేయవద్దని సూచించారు. సత్తుపల్లి ట్రంక్‌లో స్ట్రక్చర్ల పురోగతిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రతిష్ఠాత్మకంగా ఉన్న సీతారామ లక్ష్యం నెరవేరుతుందన్నారు. యాతాలకుంట టన్నెల్ పూర్తికాగానే గోదావరి నీళ్లు విడుదల చేస్తే కాలువలు పూర్తికాకపోయినా స్థానికంగా ఉన్న ఏర్లు, వాగులు, చెరువులకు మళ్లించడం ద్వారా సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలలోని పలు మండలాలకు గోదావరి జలాలు అందుతాయని స్పష్టం చేశారు. సెప్టెంబరు నాటికి సత్తుపల్లి ట్రంక్‌లో నీరు ప్రవహించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

**నెలాఖరుకు 'రైతు భరోసా' పూర్తి**

నెలాఖరులోగా రాష్ట్రంలో ప్రతిఒక్క రైతుకు వారి ఖాతాల్లో రూ.10వేల కోట్లు రైతు భరోసా నిధులు జమ చేస్తామని మంత్రి తుమ్మల ప్రకటించారు. దీంతో పాటు పెండింగ్‌లో ఉన్న సన్న ధాన్యం బోనస్ రూ.200కోట్లు రైతుల ఖాతాలో జమ చేస్తామని ప్రకటించారు. ఇప్పటికే రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేశామన్నారు. గతంలో ఏజెన్సీ (మిగతా 6వ పేజీలో)

## వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

- త్వరలో తాగునీటి పథకాలు, బోర్ల మరమ్మతులు పూర్తి
- ఖమ్మం డీపీవో ఆర్.ఆశాలత



**ఫటాఫట్**

**ప్రశ్న:** వేసవి మొదలైంది. తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకుంటున్న ముందస్తు చర్యలు ఏంటి?

**జవాబు:** జిల్లాలో 579 పంచాయతీలున్నాయి. అన్ని పంచాయతీల కార్యదర్శులకు నీటి ఎద్దడి రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చాం. పంచాయతీల్లో ఉన్న చేతిపంపులు, ఓవర్‌హెడ్ ట్యాంకులన్నింటికీ మరమ్మతులు చేయాలని ఆదేశాలు ఇచ్చాం. ఎక్కడైనా భూగర్భజలాలు అడుగంటి తాగునీటి బోర్లు ఎండిపోతే సమీపంలో ప్రైవేటుగా ఉన్న బోర్లు బావులు, ఇతర నీటి వనరులన్న అవకాశాలను గుర్తించాలని చెప్పాం. ఇప్పటికే అన్ని పంచాయతీల్లో ప్రత్యామ్నాయ మార్గాలను కూడా సిద్ధం చేశారు.

**ప్ర:** తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేకంగా నిధుల కేటాయింపు జరిగిందా?

**జ:** ఇప్పటివరకు పంచాయతీలకు ఎలాంటి నిధులు లేవు. ఇంటి పన్నులు, ఇతర ఆదాయ మార్గాల ద్వారా వచ్చే నిధులతోనే ఈ మరమ్మతులు చేపడుతున్నాం. తీవ్ర నీటి ఎద్దడి వస్తే గ్రామాల్లో ట్రాక్టర్ల ట్యాంకర్ల ద్వారా ఇతర ప్రాంతాలనుంచి నీరు తెచ్చి కాలనీలకు నీరు ఇవ్వడం, చెట్లకు పోయడం జరుగుతుంది. పంచాయతీ కార్యదర్శులు స్పెషలాఫీసర్లు ఇందుకు సంబంధించి ఎప్పకటిప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

**ప్ర:** మిషన్ భగీరథ ద్వారా శాశ్వత తాగునీటి సదుపాయం అన్ని గ్రామాలకు లేదా?

**జ:** మిషన్ భగీరథను ఆర్‌డబ్ల్యూఎస్ వారు పర్యవేక్షిస్తున్నారు. అయితే గతంలో మిషన్‌భగీరథ నుంచి సాగర్‌జలాలు సరఫరా చేశారు. అయితే కొన్ని గ్రామాల్లో కనెక్షన్లు ఇచ్చినా.. కొత్తగా ఏర్పడిన ఇళ్లకు కనెక్షన్లు ఇవ్వలేదు. దీంతో వారికి పంచాయతీ నుంచి ఇచ్చిన కనెక్షన్లతో పాటు ప్రైవేటుగా సొంత బోర్లద్వారా తాగునీరు వినియోగించుకుంటున్నారు.

**ప్ర:** కొన్ని చోట్ల తాగునీటి పథకాలకు మరమ్మతులు చేయాల్సి ఉంది. వాటిని ఎప్పటిలోగా చేస్తారు?

**జ:** జిల్లాలో మరమ్మతులకు గురైన బోర్లు, తాగునీటి పథకాలకు మరమ్మతులు చేయాలని కోరాం. సుమారు 500 బోర్లకు మరమ్మతులు చేయాల్సి ఉంది. అలాగే మోటార్లకు సంబంధించి కూడా కొన్నిచోట్ల మరమ్మతులు ఉన్నాయి. వాటిని కూడా త్వరగా చేయాలని సూచించాం.

**ప్ర:** జిల్లాలో పంచాయతీ ఇంటి పన్నుల లక్ష్యం అధిగమించారా?

**జ:** 579 పంచాయతీల ద్వారా ఇంటి పన్ను వసూలు లక్ష్యం రూ.16కోట్ల వరకు ఉండగా ఇప్పటి వరకు రూ.12కోట్లు వసూలు చేశాం. 20వ తేదీ నాటికి నూరుశాతం వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

**ప్ర:** పంచాయతీల ద్వారా చేపడుతున్న ఇతర కార్యక్రమాలు ఏంటి?

**జ:** ప్రతి పంచాయతీలో వ్యర్థాల ద్వారా వర్మీకంపోస్టు తయారు చేయాలని పంచాయతీలకు సూచించాం. వర్మీకంపోస్టు కిట్లను కూడా నిర్మించాం.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

## నేడు రామయ్యకు డోలోత్సవం, వసంతోత్సవం

- సంప్రదాయబద్ధంగా అంకురార్పణ
- శ్రీరామనవమి కల్యాణ తలంబ్రాల తయారీకి శ్రీకారం



తీర్థ బిందెను తీసుకొస్తున్న దృశ్యం

భద్రాచలం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో గురువారం సంప్రదాయబద్ధంగా డోలోత్సవం, వసంతోత్సవానికి అంకురార్పణ చేశారు. సంప్రదాయం ప్రకారం ముందుగా గోదావరి నుంచి తీర్థ బిందెను తీసుకొచ్చారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి డోలోత్సవం, వసంతోత్సవం చేశారు. కాగా హోలీ పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం భద్రాద్రి రామయ్యకు డోలోత్సవం, వసంతోత్సవం నిర్వహించనున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో (మిగతా 6వ పేజీలో)

## అంకురార్పణ ఆలస్యం

- 'బ్రహ్మ' వస్తేనే ప్రారంభిస్తామన్న వైదిక సిబ్బంది
- వైదిక సిబ్బంది, ఈవో మధ్య వాడీవేడి చర్చ
- మూడున్నర గంటలు జాప్యం

6

## ఎల్‌ఆర్‌ఎస్ రాబడిలో ఖమ్మం నెం.1

- నగర పరిధిలో ఇప్పటికే రూ.8.27 కోట్ల ఆదాయం
- మరింత వేగంగా భూముల క్రమబద్ధీకరణ
- ప్రత్యేక చొరవ తీసుకుంటున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ(ఎల్‌ఆర్‌ఎస్) ద్వారా ఆదాయ రాబడిలో రాష్ట్రంలోని 13 మునిసిపాలిటీల్లో ఖమ్మం నగరపాలక సంస్థ ప్రథమ స్థానంలో నిలిచింది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను ఆన్‌లైన్ వెరిఫికేషన్‌తో పాటుగా దరఖాస్తుదారుల నుంచి ఆన్‌లైన్ చెల్లింపులు నిర్వహించటంతో రాష్ట్ర ఖజానా ఖమ్మం నగర పాలక సంస్థ డబ్బులతో గలగలలాడుతోంది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు వేగవంతం కావటానికి కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కేఎంసీ కార్యాలయం నుంచి ప్రధాన సెంటర్ల వరకు హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశారు. దరఖాస్తుదారులకు అవగాహన కల్పించారు.

**13 మునిసిపాలిటీల్లో నెంబర్‌వన్ ఖమ్మం**

రాష్ట్రంలో 13 నగరపాలకాలు, మునిసిపాలిటీలు ఉన్నాయి. హైదరాబాద్ తర్వాత వరంగల్, ఖమ్మం నగర పాలక సంస్థలు ఆదాయ రాబడి ఇతర అంశాల్లో పోటాపోటీగా ఉంటాయి. ప్రస్తుతం ఎల్‌ఆర్‌ఎస్ ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ ద్వారా స్థల యజమానులకు ఇళ్ల స్థలాల్లో ఇంటి నిర్మాణాలను పూర్తిస్థాయిలో హక్కులు కల్పిస్తూనే మరో వైపు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం వచ్చేందుకు ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ విధానం ప్రకటించింది. దీంతో అన్ని మునిసిపాలిటీల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది.



కేఎంసీలో ఎల్‌ఆర్‌ఎస్ కౌంటర్ వద్ద దరఖాస్తుదారుల తాకిడి

ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 2020కు ముందు రూ.100చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్‌కు కోసం చేసిన దరఖాస్తులు 19,079 ఉన్నాయి. వాటిలో ఇప్పటి వరకు 1,428దరఖాస్తులను క్లియర్ చేసి దరఖాస్తుదారుల నుంచి ఆన్‌లైన్ చెల్లింపులు చేయించారు. దీంతో ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు రూ.8.27కోట్లు చేరాయి. రాష్ట్రంలోనే అన్ని (మిగతా 6వ పేజీలో)

## 17న పెదవాగు సందర్శనకు జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్

అశ్వారావుపేట రూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలంలోని గుమ్మడివల్లిలో ఉన్న పెదవాగు ప్రాజెక్టును 17న జాతీయ ఎస్సీఎస్టీ కమిషన్ సభ్యులు సందర్శించనున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 16 వేల ఎకరాల ఆయకట్టు కలిగిన పెదవాగుప్రాజెక్టు ఆనకట్ట గతేడాది (మిగతా 6వ పేజీలో)

## రూ.22లక్షలు జీఎస్టీ చెల్లించండి

- కూలీకి కమర్షియల్ కార్యాలయం నుంచి నోటీస్
- రూ.కోటి గ్రానైట్ వ్యాపారం చేసినట్టు పేర్కొన్న అధికారులు
- లబోదిబోమంటున్న బాధితుడు
- భద్రాద్రి జిల్లా చంద్రుగొండలో వెలుగుచూసిన ఘటన

6

# కిష్టారం గ్రామస్థుల కోరిక న్యాయమైనదే

**దీక్షా శిబిరాన్ని సందర్శించిన సింగరేణి డైరెక్టర్ పా వెంకటేశ్వర్లు**



మాట్లాడుతున్న డైరెక్టర్ పా వెంకటేశ్వర్లు

సత్తుపల్లిరూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కాలుష్యం బారినపడి రిలే నిరాహార దీక్షలు చేపట్టిన కిష్టారం గ్రామస్థుల కోరిక న్యాయమైనదేనని డైరెక్టర్ పా బీ.వెంకటేశ్వర్లు అన్నారు. 32వ రోజుకు చేరిన కిష్టారంలోని రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించగా అంబేద్కర్ నగర్, బీసీ కాలనీ వాసులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యను ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లానని, పరిశీలనలో ఉందన్నారు. అదేవిధంగా జిల్లాలోని మంత్రులతోపాటు ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకుంటేనే ఈ సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. సింగరేణిలో సంస్థ వాటాను పరిశీలిస్తే రాష్ట్రానికి 49 ఉండగా కేంద్రానికి 51శాతం ఉందని, రాష్ట్రంలో ఎక్కువ మొత్తంలో సింగరేణి ద్వారానే విద్యుత్ వినియోగానికి బొగ్గు అందించబడుతుందన్నారు. ఈ క్రమంలో జేవీఆర్, కిష్టారం ఓసీల నుంచి ఉత్పత్తి అవుతున్న బొగ్గుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, రెండు రోజులపాటు అవకాశం ఇస్తే సమస్య పరిష్కారం అవుతుందని హామీ ఇచ్చారు. అదేవిదంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామానికి పునరావాసం కానీ, సైలోబంకర్‌ను గానీ తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొత్తగూడెం జీఎం షాలెంరాజు, పీవోలు ఎంవీ.నరసింహారావు, ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల ఆరాధ్య దైవం

# జ్వాలా లక్ష్మీనరసింహస్వామి

- 75 ఏళ్ల క్రితం బుర్ధారం కారడవిలో వెలసిన స్వామివారు
- నేడు అంగరంగ వైభవంగా స్వామివారి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

కరకగూడెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): భక్తుల కోర్కెలు తీర్చుతూ నిత్యపూజలు అందుకుంటు న్న శ్రీసువర్ణగిరి జ్వాలా లక్ష్మీనరసింహస్వామి ఆలయం భద్రాద్రి జిల్లా కరకగూడెం మండలం బుర్ధారం గ్రామం పరిధిలో సుమారు 7కి.మీ. దూరంలోని కారడవిలోని పెద్ద గుట్టపై కొలువు తీరింది. సుమారు 75ఏళ్ల క్రితం బుర్ధారం గ్రామానికి చెందిన పోలెబోయిన లక్ష్మీనర్సయ్య, లక్ష్మీనర్సమ్మ అనే దంపతులకు స్వామివారు కలలో వచ్చి నేను గుట్టపై గుహలో వెలసి ఉన్నానని నాకు ఆలయ నిర్మాణం చేసి పూజలు చేయాలని కోరగా..ఆ దంపతులు సూర్యోదయం కాగానే పలువురు అనుభవజ్ఞులను, సాధుపుంగవులను, పూజారులతో కలిసి గుట్టపైకి చేరుకోగానే.. ఆ గుహలో మహాద్భుతం దర్శనమైంది. గుహలో సూర్యకాంతి కంటే ఎక్కువ జ్వాలలతో ప్రకాశిస్తున్న స్వామివారిని దర్శించిన పూజారులు స్వామివారు జ్వాలా లక్ష్మీనర్సింహస్వామిగా గుర్తించారు.

ఆ గిరిజన దంపతులైన పోలెబోయిన నర్సయ్య, లక్ష్మీనర్సమ్మ గ్రామస్థుల సహకారంతో ఆ గుహనే ఆలయంగా తీర్చి 9 అడుగుల విగ్రహాన్ని ప్రతిష్ఠించి ద్వారపాలకులు, జయవిజయులు, గరుత్మంతుడు, అంజనేయ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఇక్కడ ప్రత్యేకతగా ఆదిశక్తి స్వరూపిని అయిన జగదాంబ ఆలయంలో స్వయంభుగా నిలిచిందని పూజారులు తెలిపారు. ఆనాటి నుంచి పోలెబోయిన వంశీయులు ప్రతీ పాల్గుణ శుద్ధ పౌర్ణమి నాడు తిరుకల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.

**నేడు స్వామివారి కల్యాణం**

బుర్ధారం కారడవిలో వెలసిన శ్రీసువర్ణగిరి జ్వాలా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం శుక్రవారం మధ్యాహ్నం ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీలతో నిర్వహిస్తారు. మహాగణపతిపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, ధ్వజారోహణం, అంకురార్పణ, ఎదుర్కోలు మహోత్సవం నిర్వహిస్తారు. స్వామి కల్యాణానికి పోలెబోయిన వంశీయులు, ఆలయ ధర్మకర్త పోలెబోయిన రవితేజ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

# నిధులు రాలేదంటూనే పనులు

- రూ.ఏడున్నర కోట్ల నిధులు ప్రకటించిన అధికారులు
- తమ సొంత జేబుల నుంచి పనులు చేయిస్తున్నామంటున్న అటవీశాఖ అధికారులు



బ్రహ్మళకుంట వద్ద నిర్మిస్తున్న సింహద్వారం

పెనుబల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కనకగిరి గుట్టలను అభివృద్ధి చేసేందుకు ఎకో టూరిజం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.ఏడున్నర కోట్లు కేటాయించింది. ఆ నిధులు మంజూరు కానప్పటికీ అటవీ శాఖ తల్లాడ ఫారెస్టు రేంజ్ అధికారులు సొంత ఖర్చులతో ఇప్పటికే పలు అభివృద్ధి పనులను చేపట్టడం పలు విమర్శలకు తావిస్తోంది. అటవీశాఖ అధికారులు ఇప్పటికే బ్రహ్మళకుంట, తాళ్లపెంట, బెండాలపాడు గ్రామాల సరిహద్దులో ఉన్న అటవీ శాఖ ముఖద్వారాలను నిర్మిస్తున్నారు. వీటితోపాటు టూరిస్టులు సేదతీరేందుకు బ్రహ్మళకుంట సమీపంలో ఆరు హట్స్ నిర్మాణ పనులను ప్రారంభించారు. దీంతోపాటు పులిగుండాల ప్రాజెక్టు సమీపంలో ప్రత్యేకంగా హట్స్‌ను నిర్మించారు. నిర్మాణాల కోసం తల్లాడ రేంజ్ పరిధిలోని డీఆర్వో సురేష్‌కుమార్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే రూ.లక్షలు తన సొంత జేబు నుంచి వెచ్చించానని తెలిపారు. రేంజ్ అధికారి ఉమ సైతం ఈ పనులు తమశాఖ ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయని తెలిపారు.

ఇదిలా ఉండగా ఎకో టూరిజం అభివృద్ధి కోసం ప్రభుత్వం కేటాయించిన నిధులతో పనులు చేపట్టాల్సి ఉందని, కానీ నిధులు మంజూరైనట్టు తమకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదని ఆ శాఖ జిల్లా అధికారులు చెబుతున్నారు. అటవీశాఖ చేపట్టిన పనులకు ఎలాంటి అంచనాలు కానీ, పనులు మంజూరు అయినట్టు కానీ తమ వద్ద ఎలాంటి ఉత్తర్వులు లేవని అటవీ శాఖ అధికారులే చెబుతుండటం విడ్డూరంగా ఉంది. నిధులు లేకుండా అభివృద్ధి పనులు ఎలా చేపడతారని అటవీశాఖ అధికారులను పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ కనకగిరి గుట్టల్లో ఎకో టూరిజం అటవీశాఖ అధికారులు తమకు అనుకూలంగా మలుచుకొని పనులను నిర్వహిస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. అందుకు తగిన విధంగానే అధికారులు సైతం 'అలూ లేదు సూలు లేదు కొడుకు పేరు సోమలింగం' అన్న చందంలా అటవీశాఖ అధికారులు నిధులు కేటాయించామని, ప్రభుత్వం ప్రకటించగానే కనకగిరి గుట్టల్లో కోట్లాది రూపాయలు మంజూరవుతాయని వాటిపై కన్నేసి కాజేసేందుకే కొందరు అధికారులు ఎలాంటి మంజూరు అనుమతులు లేకుండానే పనులు చేస్తున్నారని, ఈ పనులపై నిగ్గు తేల్చాలని పలువురు గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.



హట్స్ నిర్మాణానికి వేసిన బేస్‌మెంట్లు

**ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే పనులు చేయిస్తున్నాం**

ఉమ, తల్లాడ రేంజ్ అధికారి

కనకగిరి గుట్టల్లో ఎకో టూరిజం ప్రాజెక్టు మంజూరైందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే పనులు చేపట్టాం. ఇప్పటికే బ్రహ్మళకుంట, తాళ్లపెంట వద్ద ముఖద్వారాలు, బ్రహ్మళకుంట వద్ద టూరిస్టులు సేదతీరేందుకు హట్స్, పులిగుండాల వద్ద హట్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

# ఇక్కడ హోలీ మూడు రోజుల వేడుక

- లోక్యాతండాలో దశాబ్దాలుగా సంప్రదాయంగా వేడుకలు
- రేపటి నుంచి మూడు రోజుల పాటు పండుగ



లోక్యాతండాలో కోలాటం (ఫైల్)

కూసుమంచి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కూసుమంచి మండలం లోక్యాతండా హోలీ వేడుకలకు ప్రసిద్ధి. ఇక్కడ సంబురాలు మూడురోజుల పాటు ఘనంగా జరుగుతాయి. సాధారణంగా ప్రతిగ్రామంలో ఒక్కరోజు మాత్రమే జరుపుకొనే ఈ పండుగను ఇక్కడ మాత్రం ఒక ప్రత్యేకతగా జరుపుకోవడం దశాబ్దాలుగా వస్తోంది. హోలీ వేడుకల్లో పాల్గొనేందుకు వివిధ గ్రామాల నుంచి బంధువులు, కుటుంబసభ్యులు ఇక్కడకు చేరుకున్నారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడురోజుల పాటు పండుగ జరుపుకోనున్నారు.

**మొదటి రోజు కోలాటం**

హోలీ ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు శుక్రవారం సాయంత్రం పెద్దఎత్తున కోలాటం వేడుకను జరుపుకొంటారు.. చిన్నపెద్ద తారతమ్యం లేకుండా అందరు కలిసి కోలాట వేడుకల్లో పాల్గొంటారు. ఉద్యోగాలు చేసేవారు, యువకులు సైతం పెద్దఎత్తున పాల్గొంటారు.

**రెండో రోజున కామదహనం, డూండ్ కార్యక్రమం**

హోలీ వేడుకల్లో భాగంగా రెండోరోజున శనివారం కామదహనం, డూండ్ కార్యక్రమం నిర్వహిస్తారు. తెల్లవారుజామున 4 గంటలకు తండాలో కామదహన కార్యక్రమం నిర్వహిస్తారు. లోక్యాతండాలో మాత్రం ఒక్కరోజు ఆలస్యంగా జరగడం ఆనవాయితీగా వస్తుంది. ప్రతి ఇంటినుంచి కర్రలను తీసుకుని వచ్చి శివారుల్లో పేర్చి కామదహనం నిర్వహిస్తారు.

**మూడోరోజు రంగోలీ**

మూడోరోజు ఆదివారం హోలీ వేడుక జరుపుకొంటారు. మహిళలతో పిల్లలు, పెద్దలు రంగులు పూసుకుని చిందులేస్తారు. పేదవారు సైతం తమ స్థాయిలో పండుగను ఘనంగా జరుపుకొంటారు.



వనాన్ని తీసుకొస్తున్న దృశ్యం

## జనంలోకి

# వన దేవతలు

**వైభవంగా సాగుతున్న జాతర**

ఆళ్లపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): భక్తుల కోర్కెలు తీర్చేందుకు వనం నుంచి జనంలోకి గురువారం వనదేవతలు వచ్చారు. ఆళ్లపల్లి మండలం నడిమిగూడెం పంచాయతీ, సందిబంధంలో బొమ్మలవారి ఇలవేల్పు అయిన సమ్మక్క-సారక్క జాతర మూడురోజులుగా వైభవంగా సాగుతోంది. బుధవారం వనం నుంచి దేవుణ్ని గుడికి చేర్చగా, గురువారం ఊర గుట్ట నుంచి బొమ్మల వంశీయులు, గ్రామస్థులు గిరిజన సంప్రదాయలైన డోళీలు, డప్పులు, నృత్యాలు, శివశక్తుల పూనకాలతో వనాన్ని తీసువచ్చారు. కార్యక్రమంలో బొమ్మల కనకరాజు, రామయ్య, సారయ్య, నాగేశ్వరరావు, జోగరాంబాబు, చిన్నగౌరయ్య, రమేష్, బొర్రయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## డోలు వాయిద్యాలతో

# మార్మోగిన చొప్పాల

**అమ్మవారిని దర్శించుకున్న భక్తులు**

కరకగూడెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చొప్పాల పంచాయతీలోని ముసలమ్మ తల్లి ఆలయంలో గురువారం జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవారం మండెమెలుగు నుంచి మొదలైన జాతర బుధవారం ఒక్క పొద్దు నిర్వహించారు. గురువారం నిండు జాతర సందర్భంగా ముసలమ్మగుట్ట నుంచి పూజారులు వనదేవతను భక్తి శ్రద్ధలతో తీసుకొస్తున్న మార్గంమధ్యలో 2 గంటల సమయంలో పూజారులు వనదేవతలకు ఎదురుకోలు నిర్వహించారు. ఆదివాసీ సంప్రదాయాలు, డోలు వాయిద్యాలు, నృత్యాలు, పూనకాలతో జన సంద్రంలో ముసలమ్మ ఆలయం వద్ద గద్దెలపై వనదేవతలను కొలువు తీర్చారు. అనంతరం భక్తులు వనదేవతలను దర్శించుకున్నారు. శుక్రవారం శుంకు పండుగ అనంతరం వన దేవతలను గుట్టకు చేర్చడంతో జాతర మహోత్సవం ముగుస్తుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## ఎల్ఆర్ఎస్ రాబడిలో

# ఖమ్మం నెం.1

(5వ పేజీ తరువాయి)

మునిసిపాలిటీల్లో ప్రథమ స్థానం దక్కించుకుంది. వరంగల్ నగరపాలక సంస్థ రూ.7.10కోట్లు సాధించి ద్వీతీయ స్థానంలో నిలిచింది.

**ఆర్పీల సమన్వయంతో కార్యచరణ**

ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించేందుకు ఇంకా 17,651 దరఖాస్తులు ఉన్నాయి. ఆయా దరఖాస్తుదారులకు సమాచారం అందించేందుకు వారి ఫోన్‌లకు ఎస్ఎంఎస్ సమాచారం పంపుతున్నారు. ఖమ్మంలో 8 హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశారు. పూర్తిస్థాయిలో ప్రతి దరఖాస్తుదారుల వద్దకు వెళ్లి వారి ఎల్ఆర్ఎస్ దరఖాస్తు సమాచారం నేరుగా అందించేందుకు ఖమ్మం మెప్మాలోని ఆర్పీలను సమన్వయం చేశారు. ప్రతి ఆర్పీకి వారి పరిధిలో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల వివరాలను అందించారు. ఏ దరఖాస్తుదారుడు ఎంత ఫీజు చెల్లించాలనే విషయాలను ఆర్పీలకు అందించారు. ప్రభుత్వం 25శాతం రాయితీ తర్వాత ఎంత ఫీజు చెల్లించాలనే విషయాలను పూర్తి వివరాలతో ఆర్పీలకు అందించారు. ఫోన్‌పే, గుగుల్ పే, ఇతర డిజిటల్ చెల్లింపుల ద్వారా నేరుగా ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లింపులు చేసేందుకు ఆర్పీలతో సమన్వయం చేశారు. ఈ మేరకు గురువారం ఖమ్మం పట్టణ ప్రణాళిక అధికారి వసుంధర, ఖమ్మం టీఎంసీ గుడిపూడి సుజాతరాణి ఆర్పీలతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు.

## అధికారులు సమన్వయంతో పనిచేయాలి

(5వ పేజీ తరువాయి)



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి

ప్రాంతంలో సాగునీరు, రోడ్లు, విద్య, వైద్యం వసతులు లేక గిరిజనులు ఇబ్బందులకు గురయ్యారని, ఈ కారణంగా ఏజన్సీ ప్రాంతంపై తాను దృష్టిపెట్టి అభివృద్ధి చేశానని తెలిపారు. అనంతరం మైదాన ప్రాంతంపై దృష్టి సారించి అభివృద్ధి కార్యక్రమాలు చేశానని వివరించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతోనే పనిచేస్తున్నామన్నారు. అందులో భాగంగా గో దావరి జలాలను మళ్లించేందుకు సీతారామ ఎత్తిపోతల పథకం చేపట్టామన్నారు. జిల్లాలో ఎన్నెస్పీ ఆయకట్టుకు కృష్ణాజలాల కొరత ఉండటం వల్ల రైతులు సమృద్ధిగా పంటలు పండించుకోలేని పరిస్థితి ఉందని, గోదావరి జలాలు సాగర్ కాలువలకు మళ్లించడం ద్వారా ఆయకట్టు స్థిరీకరణ జరుగుతోందన్నారు. పత్రికల్లో వెలువడే కథనాలపై కూడా అధికారులు దృష్టి సారించాలని, పత్రికలలో వచ్చే కథనాలు నిజమైతే వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోయే రోజుల్లో వ్యవసాయానికి, రైతులకు మంచి భవిష్యత్ ఉండబోతోందన్నారు. బుగ్గపాడు ఫుడ్‌పార్క్‌లో మరికొన్ని పరిశ్రమలు స్థాపించే విధంగా కృషి చేస్తానన్నారు.

**ఆగస్టు 15కు గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రారంభం**

వచ్చే ఆగస్టు 15నాటికి ఖమ్మం-దేవరపల్లి-రాజమండ్రి గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే పనులు పూర్తవుతాయని, గ్రీన్‌ఫీల్డ్‌హైవే అప్పటికి ప్రారంభించనున్నట్లు మంత్రి తుమ్మల ప్రకటించారు. ఇప్పటికే జిల్లాలో ప్రధాన నగరాలను కలుపుతూ జాతీయ రహదారులను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఉగాదికి వేంసూరు మండలం కల్లూరుగూడెంలో ఆయిల్‌ఫామ్ కర్మాగారానికి శంకుస్థాపన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జడ్పీ సీఈవో దీక్షారైనా, ఎస్‌డీసీ ఎం.రాజేశ్వరి, ఎస్ఆర్ఎల్ఐ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు డా.మట్టా దయానంద్ పాల్గొన్నారు.

# అంకురార్పణ ఆలస్యం

- 'బ్రహ్మ' వస్తేనే ప్రారంభిస్తామన్న వైదిక సిబ్బంది
- వైదిక సిబ్బంది, ఈవో మధ్య వాడీవేడి చర్చ
- మూడున్నర గంటల పాటు జాప్యం



అంకురార్పణ ప్రారంభమైన దృశ్యం

భద్రాచలం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్న డోలోత్సవం, వసంతోత్సవాలకు గురువారం అంకురార్పణ నిర్వహించాల్సి ఉండగా ఊహించని పరిణామాలతో ఈ కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభమైంది. ఈసారి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో ఉప ప్రధాన అర్చకులు అమరవాది వెంకట శ్రీనివాసరామానుజం క్రతువులో బ్రహ్మగా వ్యవహరిస్తున్నారు. కాగా ఆయన విధి నిర్వహణలో ఇటీవల వ్యవహరించిన తీరు విమర్శలకు తావిచ్చింది. ఈ క్రమంలో దేవస్థానం అధికారులు శాఖపరమైన చర్యల్లో భాగంగా పర్ణశాల రామాలయానికి పంపారు. కాగా గురువారం సాయంత్రం ప్రారంభం కావాల్సి ఉన్న అంకురార్పణలో బ్రహ్మగా ఆయన బాధ్యతలు నిర్వహించనుండటంతో ఆయన వస్తేనే అంకురార్పణ ప్రారంభిస్తామని వైదిక సిబ్బంది పేర్కొంటూ కార్యక్రమాన్ని నిలిపివేశారు. ఇదిలా ఉండగా మూడున్న గంటల అనంతరం బ్రహ్మగా వ్యవహరిస్తున్న ఉప ప్రధాన అర్చకులు అమరవాది శ్రీనివాస రామానుజం రాకతో అంకురార్పణ కార్యక్రమం సంప్రదాయబద్ధంగా ప్రారంభమైంది.

**దేవస్థానం ఈవో, వైదిక సిబ్బంది మధ్య వాడివేడి వ్యాఖ్యలు**

ఈ సమయంలో దేవస్థానం ఈవో వైదిక సిబ్బంది మధ్య వ్యాఖ్యలు వాడివేడిగా సాగాయి. అంకురార్పణ నేపథ్యంలో బ్రహ్మగా బాధ్యతలు నిర్వహించే శ్రీనివాస రామానుజంను ఈ రెండు రోజులతో పాటు 30నుంచి 13 రోజుల పాటు క్రతువులో పాల్గొనేందుకు అనుమతించాలని ఇరువురు ప్రధాన అర్చకులు కలిసి చెప్పినా స్పందించలేదని వైదిక సిబ్బంది ఆరోపించారు. ఇదే సమయంలో వైదిక సిబ్బందిలో కీలకంగా వ్యవహరించే పెద్దలు గతంలో అతడి వల్ల జరిగిన పొరపాటు పునరావృతం కానివ్వబోమని, ఇందుకు తాము బాధ్యత వహిస్తామని లేఖ అందజేసినా ఈవో నిర్ణీత సమయంలో స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైదిక సిబ్బంది పట్ల వ్యవహరిస్తున్న తీరు తమను ఆవేదనకు గురిచేస్తోందని పలువురు వైదిక సిబ్బంది ఈవో దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈవో స్పందిస్తూ సరైన రీతిలో తనకు లేఖ సమర్పించలేదని స్పష్టం చేశారు. ఉప ప్రధాన అర్చకుడి విషయంలో ఏఈవో, ఎస్‌పీఎఫ్ సిబ్బంది ఇచ్చిన నివేదికను అనుసరించే చర్యలు తీసుకున్నామని, ఉద్దేశ్యపూర్వకంగా తాను ఏమీ చేయలేదని ఈవో పేర్కొన్నారు. వైదిక సిబ్బందిపై ఉన్న గౌరవంతోనే పర్ణశాలలో విధులు నిర్వహించేందుకు పంపినట్లు తెలిపారు. 'సరైన రీతిలో లేఖ అందజేయండి, బ్రహ్మతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించండి' అని ఈవో వైదిక సిబ్బందికి సూచించారు. ఈ సమయంలోనే బ్రహ్మ కూడా అక్కడికి రావడంతో అంకురార్పణ కార్యక్రమం ప్రారంభమైంది. కాగా ఉప ప్రధాన అర్చకుడి విషయమై నివేదికను కమిషనర్‌కు పంపనున్నట్లు ఈవో విలేకరులకు వెల్లడించారు. అలాగే ఈ విషయమై కమిషనర్ సైతం ఆరాతీసినట్లు పేర్కొన్నారు.

## 1 నుంచి ధాన్యం

# కొనుగోళ్లకు సన్నాహాలు

(5వ పేజీ తరువాయి)

ఆశాజనకంగా ఉన్నందున ధాన్యం అధికంగా ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం పొట్టదశలో ఉన్న ధాన్యం ఏప్రిల్ 2వ వారం నుంచి జిల్లాలో కోతలు ముమ్మరంగా జరగనున్నాయి. వానాకాలంలో జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం సన్నధాన్యానికి క్వింటాకు రూ.500బోనస్ ఇవ్వడంతోపాటు ప్రైవేటుగా కూడా ధాన్యానికి మద్దతు ధర లభించింది. ప్రైవేటులో ధాన్యం ధర తగ్గగానే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకుని రైతులు లబ్ధిపొందారు. యాసంగిలో కూడా జిల్లాలో 340 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి 2.50లక్షల మె.ట ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా యంత్రాంగం ప్రాథమిక లక్ష్యంగా పెట్టుకుంది. అయితే రైతుల నుంచి ఇంకా ఎక్కువ మొత్తంలో ధాన్యం వచ్చినా పూర్తిస్థాయిలో కొనుగోలు చేయనున్నారు. జిల్లాలో వానాకాలంలో 340 కొనుగోలు కేంద్రాల ద్వారా 2.95లక్షల మె.ట ధాన్యంను కొనుగోలు చేసి రూ.625కోట్ల వరకు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు వ్యాపారం నిర్వహించారు.

ఇందులో రైతులకు కూడా బోనస్ ద్వారా భారీగా లబ్ధి పొందారు. దీంతో యాసంగిలో కూడా రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే ధాన్యం అమ్మే అవకాశం ఉంది. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏప్రిల్ 1నుంచి ధాన్యం కొనుగోలుకు ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు వచ్చాయి. వానాకాలం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లుగానే యాసంగిలోనూ అదే కార్యచరణతో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు సన్నాహాలు చేపట్టారు. ఇందుకు సంబంధించి కలెక్టర్ అధ్యక్షతన త్వరలో సమావేశం నిర్వహించనున్నారు.

# రూ.22లక్షలు జీఎస్టీ చెల్లించండి

- కూలీకి కమర్షియల్ కార్యాలయం నుంచి నోటీస్
- రూ.కోటి గ్రానైట్ వ్యాపారం చేసినట్టు పేర్కొన్న అధికారులు
- లబోదిబోమంటున్న బాధితుడు
- భద్రాద్రి జిల్లా చంద్రుగొండలో వెలుగుచూసిన ఘటన

చంద్రుగొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పూట గడవడమే కష్టంగా ఉన్న ఓ కూలీకి కమర్షియల్ ట్యాక్స్ విభాగం అధికారులు ఏకంగా రూ.22లక్షల జీఎస్టీ చెల్లించాలని నోటీసులు జారీ చేశారు. రూ.కోటి గ్రానైట్ వ్యాపారం చేశాడని, అందుకు రూ.22లక్షలు జీఎస్టీ చెల్లించాలని సదరు కూలీకి విజయవాడ కమర్షియల్ కార్యాలయం నుంచి నోటీసులు అందాయి. భద్రాద్రి జిల్లా చంద్రుగొండ గ్రామానికి చెందిన జానపటి వెంకటేశ్వర్లు అనే కూలీకి విజయవాడ కేంద్రంగా భాగ్యలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ పేరిట 2022లో గ్రానైట్ వ్యాపారానికి సంబంధించి రూ.22 లక్షల 86వేల 14లు జీఎస్టీ చెల్లించాలని పోస్టుద్వారా ఈ నెల 4న నోటీసు వచ్చింది. దీంతో వెంకటేశ్వర్లు ఆ నోటీసులు తెలిసిన వ్యాపారుల వద్దకు తీసుకెళ్లి విషయం తెలుసుకొని ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. దాంతో సదరు వ్యాపారులు వెంకటేశ్వర్లును తీసుకొని 12న నోటీస్‌లో ఉన్న భాగ్యలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ అడ్రస్ తెలుసుకునేందుకు విజయవాడకు వెళ్లారు. కానీ అక్కడ కార్యాలయం ఏదీ లేదు. కాగా వెంకటేశ్వర్లుకు పాన్‌కార్డు సైతం లేదు. ఆరు నెలల క్రితం స్థానిక ఏజెంట్‌ను కలిసి పాన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోగా అప్పటికే వెంకటేశ్వర్లుకు పాన్‌కార్డు జారీ అయినట్లు తేలింది. ఎవరో అక్రమార్కులు తనపేరుపై తప్పుడు పత్రాలు సృష్టించి మోసం చేశారని, తనకు ఏం చేయాలో పాలుపోవడం లేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

## 17న పెదవాగు సందర్శనకు..

# జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్

(5వ పేజీ తరువాయి)

వచ్చిన వరదలకు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే.. అయితే ఈ ప్రాజెక్టు తెలంగాణాలో ఉండగా ఆయకట్టు ఎక్కువగా ఏపీలో ఉండటంతో ఈ రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రాజెక్టు పునరుద్ధరణపై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టడం లేదు. 1979లో నాటి ఉమ్మడి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి స్వర్గీయ జలగం వెంగళరావు నిర్మించిన ఈ ప్రాజెక్టు ఈ పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా మారింది. ఈ నేపథ్యంలో తన తండ్రి నిర్మించిన ప్రాజెక్టు దుస్థితిని కేంద్రానికి తెలిపేందుకు మాజీ మంత్రి జలగం ప్రసాదరావు సిద్ధమయ్యారు. గత వానాకాలం సీజన్‌లో వచ్చిన వరదలతో కొట్టుకుపోయిన చంద్రుగొండ మండలంలోని వెంగళరావు ప్రాజెక్టును ప్రభుత్వం పట్టించుకోవట్లేదని ఆయకట్టు రైతులు చేసిన ఫిర్యాదు మేరకు ఆ ప్రాజెక్టును సందర్శించేందుకు 17వ తేదీన జాతీయ ఎస్సీఎస్టీ కమిషన్ బాధ్యులు విచ్చేస్తున్న నేపథ్యంలో తన తండ్రి నిర్మించిన పెదవాగు ప్రాజెక్టును కూడా సందర్శించాలని మాజీ మంత్రి జలగం ప్రసాదరావు కమిషన్ సభ్యులను కోరారు. దాంతో వారు 17న ప్రాజెక్టు సందర్శనకు రానున్న నేపథ్యంలో గురువారం ప్రాజెక్టు వద్ద రెండు రాష్ట్రాల్లోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఆయకట్టు రైతులతో జలగం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై ఆయన మాట్లాడారు. కమిషన్ ముందు రైతులు తమ సమస్యలను వివరించాలని సూచించారు. రెండు రాష్ట్రాల నుంచి రైతులు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. కేంద్రం నుంచి ఎలాగైనా నిధులు తెచ్చేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ నిర్మల పుల్లారావు, పెద్దలు పుట్టా సత్యం, ఆశోక్‌తో పాటు పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## నేడు రామయ్యకు

# డోలోత్సవం, వసంతోత్సవం

(5వ పేజీ తరువాయి)

మార్చి 30నుంచి శ్రీ విశ్వావసునామ సంవత్సర వసంతపక్ష ప్రయుక్త నవాహ్నిక శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 6న స్వామివారికి కల్యాణం నిర్వహించనున్నారు. నేడు హోలీ పౌర్ణమిని పురస్కరించుకొని స్వామివారికి సహస్రధారతో ప్రత్యేక స్నపనం నిర్వహించనున్నారు. అనంతరం స్వామివారిని అలంకరించి ఉయ్యాలలో ఆశీనులను చేసి డోలోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆస్థాన విద్వాంసులు రామదాసు, తూము నరసింహదాసు కీర్తనలను ఆలపిస్తుండగా నక్షత్ర, కుంభహారతిలను స్వామి వారికి ప్రత్యేకంగా సమర్పించనున్నారు. హోళీ పౌర్ణమిని పురస్కరించుకొని వసంతోత్సవాన్ని నిర్వహించనుండగా ముందుగా ప్రధాన ఆలయంలోని ధృవమూర్తులకు, ఆంజనేయస్వామికి, లక్ష్మీతాయారు అమ్మవారికి వసంతాన్ని శాస్త్రోక్తంగా చల్లి తరువాత భక్తులపై వసంతోత్సవ కార్యక్రమానికి చిహ్నంగా పసుపు నీళ్లను చల్లుతారు. దీన్నే వసంతోత్సవంగా పేర్కొంటారు. అలాగే సాయంత్రం స్వామివారికి భాజభజంత్రీలతో తిరువీధిసేవ నిర్వహిస్తారు. ఇదిలా ఉండగా డోలోత్సవం, వసంతోత్సవం నిర్వహించిన రోజు భద్రాద్రి రామయ్యను పెళ్లికుమారుడిగా చేసినట్లుగా స్థానికులు భావిస్తారు.

**నేడు స్వర్ణలక్ష్మి అమ్మవారికి పూజ**

భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి సన్నిధిలో పాల్గుణోత్తర మహోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ స్వర్ణలక్ష్మి అమ్మవారికి సామూహిక శ్రీలక్ష్మి పూజలు నిర్వహించనున్నారు. శ్రీలక్ష్మి మహిళా సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కర్యక్రమంలో దేవస్థానానికి రూ.600 చెల్లించిన భక్తులకు లక్ష్మి అమ్మవారి వెండి ప్రతిమ, లడ్డూ, పులిహోర ప్రసాదం, శ్రీలక్ష్మి అమ్మవారి పూజా కుంకుమను అందిస్తారు. ముత్తైదువుకు లడ్డూ, పులిహోర ప్రసాద ప్యాకెట్‌ను అందజేస్తారు. కార్యక్రమాన్ని ప్రతి ఏటా సంస్కృత పండితులు ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యులు పర్యవేక్షణలో నిర్వహిస్తుండగా శ్రీ లక్ష్మి మహిళ సేవాసమితి సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొంటుడటం విశేషం.

# తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి

### కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్.. పాలేరు జలాశయం సందర్శన



అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

కూసుమంచి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఈ వేసవిలో సాగు, తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. గురువారం పాలేరు జలాశయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఇరిగేషన్, వ్యవసాయ, రెవిన్యూ శాకల అధికారులతో సమీక్షించారు. సాగు, తాగునీటిపై తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలున్న ప్రాంతాల్లో సమన్వయంతో పనిచేస్తు పరిష్కరించాలని ఆదేశించారు. సాగునీరు వారబందీ ప్రకారం ఇస్తుండటంతో ఎప్పుడు వస్తా యో తెలియక రైతులు ఆందోళనతో రోడ్డెక్కుతున్నందున అధిగమించేందుకు వారికి ముందస్తు ఎమాచారం అందించాలన్నారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ ఉద్యోగులు కమిటీలు వేసుకుని వారబందీ సమాచారం ఇవ్వడం వల్ల సమస్యలు రావన్నారు. తహసీల్దార్, వ్యవసాయశాఖ, ఇరిగేషన్ అధికారులు ప్రతివారం ప్రజావాణి సమయంలో కొంతసమయం తాగు, సాగునీటి సరపరాపై కేటాయించాలని ఆదేశించారు, ఎవరైన రైతులు ట్యాంపరింగ్‌కు పాల్పడితే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చివరి వరకు సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఐబీ డిఈలు మధు, రత్నకుమారి, ఏడీఏ సరిత, తహసీల్దార్ కరుణశ్రీ, ఏవో వాణి తదితరులు పాల్గొన్నారు.

## 15వ బెటాలియన్ కమాండెంట్‌గా పెద్దబాబు

సత్తుపల్లిరూరల్, మార్చి13 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం గంగారంలోని 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ కమాండెంట్‌గా ఎన్.పెద్దబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన వరంగల్ జిల్లా ములుగు మండలంలోని యాపలగడ్డ 2వ బెటాలియన్ నుంచి సత్తుపల్లికి బదిలీపై వచ్చారు. 1991బ్యాచ్‌కు చెందిన ఈయన యాపలగడ్డలో అడిషనల్ కమాండెంట్‌గా పనిచేస్తూ కమాండెంట్‌గా పదోన్నతి పొందారు. హైదరాబాద్‌లోని ఇంటెలిజెన్సీ సెక్యూరిటీ వింగ్‌కు ఇన్నేళ్లపాటు ఇక్కడ కమాండెంట్‌గా పనిచేసిన పీజేపీసీ.చటర్జీ బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా కమాండెంట్‌ను అసిస్టెంట్ కమాండెంట్స్ ఎస్.శ్రీధర్‌రాజా, ఎస్‌డీ.రంగారెడ్డి, మినిస్టీరియల్ స్టాఫ్, ఆఫీసర్స్ కానిస్టేబుల్ ఆఫీసర్స్ మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు.

## 22 లోగా మ్యూజియం పనులు పూర్తి చేయాలి

భద్రాచలం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఐటీడీఏ ఆవరణలో అభివృద్ధి చేస్తున్న గిరిజన మ్యూజియం అభివృద్ధి పనులను ఈ నెల 22 లోగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ పేర్కొన్నారు. గురువారం మ్యూజియం అభివృద్ధి పనులను పీవో రాహుల్ పరిశీలించారు. శ్రీరామనవమి నాటికి భక్తులకు మ్యూజియంను వీక్షించేందుకు అందుబాటులోకి తేవాలన్నారు. బాక్స్ క్రికెట్ గ్రౌండ్, బోటింగ్ చెరువు, ఆర్చరీ గ్రౌండ్ పనులు సోమవారం వరకు పూర్తి చేయాలని, ఇతర నిర్మాణాలను 22 లోపు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, ఈఈ చంద్రశేఖర్, ఉద్యాన అధికారి ఉదయ్‌కుమార్, డీఈ హరీష్, డీఎస్‌వో ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

## బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో డిగ్రీ పాసైన బీసీ అభ్యర్థులకు బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ లో ఉచిత శిక్షణ ఉద్యోగం కల్పించటానికి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాలతో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత తెలిపారు. హైద్రాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ హైద్రాబాద్‌లో ఒక నెల నాన్ రెసిడెన్షియల్ ఉచిత శిక్షణ అందించనున్నారని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ప్రైవేటు బ్యాంకుల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. డిగ్రీ పూర్తయి 26 సంవత్సరాలు లోపు ఉన్న అభ్యర్థులు ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 8వ తేదిలోగ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 12న ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్రాలలో నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9573859598, 9441931359 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## బీటీపీఎస్ కు చేరుకున్న పవర్ జనరేటర్

మణుగూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది సాంకేతిక లోపంతో మరమ్మతులకు గురైన బీటీపీఎస్ యూనిట్ వన్‌కు చెందిన పవర్ జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ పనులు పూర్తి చేసుకుని గురువారం బీటీపీఎస్‌కు చేరుకుంది. 2024 జూన్ 29న సాంకేతిక లోపం తలెత్తడంతో షార్ట్ సర్క్యూట్ అయి కాలిపోయింది. మరమ్మతలకు గురైంది. ఆ రోజుల్లో పిడుగు పాటు వల్ల ఈ పవర్ జనరేటర్ ట్రాన్స్ ఫార్మర్ కాలిపోయిందని భావించినా తర్వాత నిశిత పరిశీలనల్లో సాంకేతిక లోపమే కారణం అని తెలిసింది. బీటీపీఎస్‌లోని నాలుగు యూనిట్లలో ఈ ట్రాన్స్‌ఫార్మర్ యూనిట్ వన్‌కు చెందింది. ఆ నాటి నుంచి నేటివరకు యూనిట్ వన్‌లో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. 270 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే యూనిట్ వన్ నిలిచిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. . నాడు జరిగిన సాంకే తిక లోపంతో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ వల్ల దాదాపు 50 కోట్ల మేరకు నష్టం వాటిల్లిందని జెన్కో డైరక్టర్లు పేర్కొన్నారు. దీంతో ఈ ట్రాన్స్‌ఫార్మర్ ను రిపేరింగ్ పనుల నిమిత్తం తమిళనాడుకు పంపించారు. జెన్కో ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టారు. ఈ పనులు ముగిసి పవర్ జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ మణుగూరు బీటీపీఎస్‌కు గురువారం సాయంత్రం చేరుకుంది. దీనిని అమర్చిన తరువాత ఏప్రిల్ 15 నాటికి యూనిట్ వన్ విద్యుత్ ఉత్పత్తి జరిగే అవకాశాలు ఉన్నాయని బీటీపీఎస్ సీఈ బిచ్చన్న తెలిపారు.

### రూ.97.62 లక్షలతో శ్రీరామనవమి పనులకు..

# టెండర్ల ఖరారు

### రేపటి నుంచి ఇంజనీరింగ్ పనుల ప్రారంభం

భద్రాచలం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు దేవస్థానం ఇంజనీరింగు విభాగం ఆధ్వర్యంలో చేపట్టే పనులకు రూ.97.62 లక్షలకు టెండర్లు ఖరారు అయ్యాయి. ఈ పనులు శనివారం నుంచి అధికారికంగా ప్రారంభం కానున్నాయి.

రూ.7.29 లక్షలతో భక్తులకు తాత్కాలిక వసతి సముదాయాల ఏర్పాటు, రూ.7.17 లక్షలతో గోదావరి ఒడ్డున, కల్యాణ కల్యాణ కట్ట, వద్ద భక్తులకు తాత్కాలిక వసతి, లడ్డూ, తలంబ్రాల కౌంటర్ల ఏర్పాటు, ఇతర పనులు నిర్వహించనున్నారు. అలాగే రూ.6.68 లక్షలతో రామాలయం పరిసరాలు, ఆలయంలో పెండాల్స్ ఏర్పాటు, రూ.6.40 లక్షలతో పర్ణశాలలో పంచరంగులు ఆలయంకు, మండపానికి వేయనున్నారు. రూ.6.50 లక్షలతో భద్రాచలంలోని కల్యాణ మండపం, ఆర్చిగేట్లకు రంగులు వేయడం, రూ.5.27 లక్షలతో ఆలయ పరిసరాల్లో పందిళ్ల నిర్మాణం, రూ.3.99 లక్షలతో కల్యాణ మండపం, క్యూలైన్లకు పెయింటింగ్ వేయనున్నారు. రూ.3.93 లక్షలతో భద్రాచలం, పర్ణశాలల్లో ఆర్చి గేట్లకు పెయింటింగ్, రూ.5.85 లక్షలతో తాత్కాలిక ప్రసాదాలు, తలంబ్రాల పంపిణీ కౌంటర్లు, రూ.5.64 లక్షలతో కల్యాణ మండపంలో పెండాల్స్ ఏర్పాటు, రూ.7.59 లక్షలతో పర్ణశాల గోదావరి ఒడ్డున, కల్యాణ మండపం వద్ద ఏర్పాట్లు చేయనున్నారు.

అదేవిధంగా రూ.7.44 లక్షలతో ఎయిర్ కండీషన్, డిజార్టు కూలర్ల ఏర్పాటు కల్యాణ మండపంలో చేపట్టనున్నారు. ఎల్ఈడీ స్క్రీన్ల ఏర్పాటుకు రూ.4.81 లక్షలతో చేపట్టనున్నారు. వీటితో పాటు వాల్‌పోస్టర్ల ప్రింటింగ్‌కు రూ.3.63 లక్షలు సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.80 వేలు కేటాయించారు.

# ఉగాది నాటికి పనులు పూర్తికావాలి: తుమ్మల

దమ్మపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఉగాది నాటికి పూసుకుంట రహదారిలో నిర్మిస్తున్న బ్రిడ్జీల నిర్మాణాన్ని పూర్తి చేయాలని వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. మంత్రి తుమ్మలను గండుగులపల్లిలో ఆయన నివాసంలో పలువురు కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసిసారు. ఈ సందర్భంగా పూసుకుంటలో జరుగుతున్న అభివృద్ధి పనులపై కొయ్యల అచ్యుతరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్రిడ్జీ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను తుమ్మల ఆదేశించారు. సత్తుపల్లి మండలానికి చెందిన పలువురు రైతులు కలిసి రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేయగా కొలుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కిష్టారంలో ఏర్పాటు చేసిన సింగరేణి బంకర వల్ల తమ కుటుంబాలకు తీవ్ర నష్టం జరుగుతుందని అనేక మంది అనారోగ్యానికి గురై మృతి చెందుతున్నారని మంత్రి వద్ద కిష్టారం గ్రామానికి చెందిన పలువురు ఆవేదన వ్యక్తం చేసారు. దీనిపై స్పందించిన తమ్మల మీ సమస్యను సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువెళ్లి సింగరేణి అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. చర్ల మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిసారు. చర్ల వ్యవసాయ మార్కెట్ కమిటి అధక్షునిగా ఇర్పా శ్రీనును నియమించటంతో తుమ్మలకు కృతజ్ఞతలు తెలుపుతూ సత్కరించారు. అంతకు ముందు తుమ్మల వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి పంటలను పరిశీలించారు. తుమ్మలను కలిసిన వారిలో పామాయిల్‌సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్ర ప్రసాదు, బండి భాస్కర్, దొడ్డా ప్రసాదు, కొయ్యల అచ్యుతరావు, కేవి సత్యనారాయణ, మన్నెం అప్పారావు, కాసాని నాగప్రసాదు, మంగేశ్వరరావు, ఎర్రా వసంతరావు, ఉడతనేని అప్పారావు, రసూల్, మొగళ్ళపు చెన్నకేశరరావు, జ్యేష్ట సత్యనారాయణ చౌదరి తదితరులు ఉన్నారు.



వ్యవసాయ క్షేత్రంలో తుమ్మల

# గ్రామీణ నియోజకవర్గాలలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లు

### ఉపాధి కల్పన , శిక్షణ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి

కొత్తగూడెం, మార్చి13(ఆంధ్రజ్యోతి): యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా గ్రామీణ నియోజకవర్గ వర్గాలలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లను (ఏటీసీ) ఏర్పాటు చేయాలని సంకల్పించిందని ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్‌కుమార్ వెల్లడించారు. గురువారం ఆయన జిల్లా కలెక్టర్‌లతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే రాష్ట్రంలో 70 ఏటిసి కేంద్రాల నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. ఇదే తరహాలో ఐటిఐ, ఏటిసి సెంటర్‌లు లేని ప్రతి గ్రామీణ ప్రాంత అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసం ఒకటి చొప్పున సెంటర్‌లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఏటిసి సెంటర్‌ల నిర్మాణానికి అనువైన ప్రదేశాన్ని గుర్తిస్తూ సమగ్ర వివరాలతో కూడిన నివేదికలను త్వరితగతిన సమర్పించాలని కలెక్టర్‌లకు సూచించారు. రాష్ట్రంలో సుమారు 45 ఏటిసి కేంద్రాలను గ్రామీణా ప్రాంత నియోజకవర్గాలలో నెలకొల్పాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. రోడ్డు, రవాణా వసతితో పాటు, సమీపంలో పరిశ్రమలు ఉన్న స్థలాలను ఎంపిక చేస్తే ఏటిసి కేంద్రాలలో విద్యార్థులు ప్రవేశాలు పొందేందుకు, ఇన్‌స్పెక్టర్లు సులువుగా రాకపోకలు సాగించేందుకు వీలుంటుందని సూచించారు. స్థానిక పరిశ్రమలకు చేరువలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అయితే సంబంధిత పారిశ్రామిక అంశాలతో కూడిన ట్రేడ్లలో యువతకు శిక్షణ అందేలా ప్రణాళిక చేపట్టవచ్చు అని అన్నారు. జూమ్ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ , అధనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌తో కలిసి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పాల్గొన్నారు. సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ అశ్వారావుపేటలో ఐటీఏ స్థాపనకు స్థల గుర్తింపు ప్రక్రియ పూర్తి అయిందన్నారు. గుర్తించిన స్థలం రహదారికి దగ్గరలో ఆర్టీసి రవాణ సౌకర్యంతో పాటు, పరిశ్రమలు కూడా ఉన్నా స్థలాన్ని గుర్తించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని అశ్వారావుపేట ఆయిల్ పామ్‌కు హబ్‌గా ఉందని, అశ్వారావుపేటలో వ్యవసాయ కళాశాల కూడా ఉన్నందున ఐటిఐ కళాశాలలో వ్యవసాయానికి సంబంధించి కోర్సులు ప్రవేశ పెట్టడం ద్వారా విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.



జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

# 'పేట'లో తెరుచుకున్న ఎంవీఐ కార్యాలయం

### నెలన్నర తరువాత ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు

### 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన అధికారులు

అశ్వారావుపేట రూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేటలో దాదాపు నెలన్నర తరువాత వాహనాల రిజిస్ట్రేషన్‌లు ప్రారంభమయ్యాయి. గత నెలన్నర నుంచి అశ్వారావుపేటలో ఉన్న మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కార్యాలయం మూతవేసి ఉంది. దీంతో వాహనదారులు రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. వాహనాదారులు దాదాపు వంద కిలోమీటర్ల దూరంలో కొత్తగూడెం వెళ్లాల్సి వస్తుంది. ఈప్రాంత వాహనదారులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకే గత ప్రభుత్వ హాయంలో వారానికి రెండు రోజులు పాటు పేటలో సేవలు అందించేలా అధికారులు ఎంవీఐ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ నేపధ్యంలో గతనెలన్నర నుంచి పేటలో సేవలను ఆపివేశారు. దీనిపై ఈనెల 7వ తేదీన "ఉన్నట్టా..లేనట్టా" అనే శీర్షిక 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం వెలువడింది. దీనికి స్పందించిన అధికారులు ఎట్టకేలకు గురువారం అశ్వారావుపేటలోని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని తెరిచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించారు. దీంతో వాహనాలను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వాహనదారులు భారీగా తరలివచ్చారు. రిజిస్ట్రేషన్లు చేయకపోవటంతో నానా ఇబ్బందులు పడుతున్నామని, తిరిగి రిజిస్ట్రేషన్లను ప్రారంభించటం ద్వారా తమ ఇబ్బందులు తొలిగాయని అన్నారు. మోటారు వెహికల్ ఇన్స్పెక్టర్ మనోహర్ వాహనాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తిచేశారు. ప్రతి వారం ఇదేమాదిరిగా కార్యాలయాన్ని తెరిచి రిజిస్ట్రేషన్లు చేయాలని వాహనదారులు కోరారు.

# పండితాపురం సంత వేలం పాట వాయిదా

కామేపల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కామేపల్లి మండల పరిధిలోని పండితాపురం గ్రామంలో శ్రీ క్రిష్ణప్రసాద్ పశవులు సంత 2025-26 సంవత్సరానికి గాను బహిరంగ వేలం పాట నిర్వహించారు. పంచాయతీ ప్రత్యేకాధికారి జి.రవీందర్ అధ్యక్షతన సంత ఆవరణలో గురువారం వేలం చేపట్టారు. ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన భూక్య వీరన్న, భూక్య నాగేంద్రబాబు, బోడ శ్రీను, బానోత్ శంకర్ నలుగురు పాటలో పాల్గొన్నారు. అధికారులు పాట తొలుత రూ.కోటి 50లక్షలతో ప్రారంభించారు. ఉదయం 11గంటల నుంచి సాగిన వేలం పాట సాయంత్రం నాలుగు గంటల వరకు సాగింది. చివరకు బోడ శ్రీను రూ. రెండు కోట్ల 35లక్షల 70వేలకు పాట పాడారు. కానీ ప్రభుత్వం నిర్ధేశించిన ధర లేకపోవడంతో పాటను వాయిదా వేశారు. వచ్చే సోమవారం మరోసారి వేలం పాట నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. మొదటి, రెండో పాటదారుల దారావత్తు సొమ్ము రూ.30లక్షలు, సాల్వెన్సీ సొమ్ము రూ.5లక్షలు అధికారుల దగ్గరే జమ చేసుకున్నారు. మరల నిర్వహించే పాటలో ఎవరు అధికంగా పాడకపోతే వీరిలో ఒకరికి తొలుత పాడిన అధిక ధరకు సంతను అప్పజెప్పుతామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీవో ఆశాలత, డీఎల్‌పీవో రాంబాబు, ఎంపీఓలు ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణ, కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.



సంత వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

# అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యం పట్టివేత

### సుమారు 500 క్వింటాళ్లు ఉన్నట్టు సమాచారం

### కరీంనగర్ పెద్దపల్లికి తరలుతున్నట్టు సమాచారం

కొణిజర్ల, మార్చి13(ఆంధ్రజ్యోతి): రెండు లారీల ద్వారా అక్రమంగా ఇతర జిల్లాలకు తరలుతున్న రేషన్ బియ్యాన్ని కొణిజర్ల వండలం తనికెళ్ల సమీపంలోని ఓ దాబా వద్ద టాస్క్‌ఫోర్స్, సివిల్ సప్లయ్ అధికారులు, పోలీస్‌లు సంయుక్తంగా పట్టుకున్న సంఘటన బుధవారం రాత్రి జరిగింది. పట్టుకున్న లారీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రెండు లారీలలో సుమారు 500 క్వింటాళ్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం సివిల్‌సప్లయ్ డీటీ ఎం.వెంకటేశ్వర్లు బియ్యానికి సంబంధించి వివరాలను వెల్లడించారు. ప్రభుత్వం పేదలకు అందిస్తున్న బియ్యాన్ని ఆటోలు ద్వారా సేకరించి లారీలలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఖమ్మం నుంచి 600 బ్యాగ్‌లతో ఓ లారీ, ఏన్కూర్ వైపు నుంచి 485 బ్యాగులతో మరో లారీ తనికెళ్ల సమీపంలో ఓ దాబా వద్ద ఆగి ఉన్నాయి. లారీలలో రేషన్‌బియ్యం(పీడీఎస్) తరులుతున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ డీఎస్పీలు అంజయ్య, యాదయ్య, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వసంత్‌కుమార్‌లతో పాటు తను సివిల్‌సప్లయ్ ఆర్‌ఐలు కిరణ్, నరేష్, కొణిజర్ల పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో లారీలను పరిశీలించడం జరిగిందన్నారు. లారీలలో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించి రెండు లారీలను డ్రైవర్‌లను పోలీస్‌స్టేసన్‌కు తరలించామన్నారు. రెండు లారీలలో మొత్తం సుమారు 500 క్వింటాళ్ల రేషన్‌బియ్యం ఉన్నట్లు తెలిపారు. రెండు లారీలను సీజ్ చేసి భద్రత నిమిత్తం ప్రస్తుతం పోలీస్‌స్టేసన్‌లో ఉంచామన్నారు. అనంతరం వాటిని వైరా ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు తరలిస్తామని, లారీలపై కేసునమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. పూర్తిగా నిర్ధారణ అనంతరం సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయటం జరుగుతుందన్నారు.

**బియ్యం ఎక్కడకు తరలుతున్నట్లు..!**

జిల్లాలో అక్రమంగా తరులుతున్న పేదలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం ఇతర ప్రాంతాలకు ఎక్కడకు తరలుతున్నాయోనని సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. తనికెళ్ల దగ్గర పట్టుబడిన రేషన్‌బియ్యం కరీంనగర్ దగ్గర పెద్దపల్లికి తరిలిస్తున్నట్లు సమాచారం. రెండు లారీలలో పట్టుబడిన బియ్యం ఖమ్మం వైపు నుంచి ఒకలారీ రాగా, ఏన్కూర్ వైపు నుంచి ఒక లారీ వచ్చి తనికెళ్ల సమీపంలోని ఓ దాబా దగ్గర ఆగిన్నట్లు అధికారులు వెల్లడించారు.

అయితే రెండు లారీలు కూడ ఒకే వ్యక్తికి చెందిన్నట్లు తెలిసింది. లారీలు మాత్రం జగ్గయ్యపేటకు చెందిన్నట్లు సమాచారం. అయితే లారీల ద్వారా పెద్దఎత్తున అక్రమంగా జరుగుతున్న రేషన్ వ్యాపారం లక్షల్లోనే జరుగుతున్నట్లు తెలుస్తుంది. రేషన్ వ్యాపారం చేసే వ్యక్తి లారీలను జిల్లాలో ఆయా మండలాలకు పంపించి లోడు అయిన తర్వాత చేరుకోవలసిన ప్రాంతానికి చేరుకునే ముందు అనుమానం రాని ప్రదేశానికి రప్పించి వాటిని అక్కడ నుంచి ఎక్కడకు తరలించాలో అక్కడకు ప్లాన్ ప్రకారం తరలిస్తున్నట్లు సమాచారం.

తనికెళ్ల దగ్గర అధికారులు పట్టుకున్న రెండు లారీల రేషన్ బియ్యం సుమారు రూ.13 లక్షలు ఉంటుందని అంచనా. ఇంత పెద్ద ఎత్తున వ్యాపారం జరుగుతున్న సంబంధిత అధికారులకు తెలవకపోవడం గమనార్హం.



పట్టుకున్న బియ్యం లారీలతో అధికారులు

### సౌర విద్యుత్ ప్యానల్స్‌ను ప్రారంభించిన..

# జిల్లా ప్రధాన న్యాయాధికారి

ఖమ్మం లీగల్ మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టులో ఏర్పాటుచేసిన సౌర విద్యుత్ ప్యానల్స్‌ను గురువారం జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యామ్నాయ ఇందన వనరులను ఉపయోగించుకోవాలని సూచించారు. ఉన్నత న్యాయస్థానం ఆదేశానుసారంగా దిగువ కోర్టుల్లో సౌర విద్యుత్‌ను వినియోగించడానికి ఈ ప్యానల్స్‌లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు ముఖ్య పరిపాలన అధికారి హరికృష్ణ, నాజర్ రాదేశ్యామ్, ఓంకార్, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

# క్రైం సమాచారం

## యువతి అదృశ్యంపై కేసు నమోదు

బూర్గంపాడు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యమైన ఘటనపై బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... బూర్గంపాడు మండల పరిధిలోని నాగినేనిప్రోలు గ్రామానికి చెందిన యువతి బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు తెలిసిన చోట్ల గాలించినా ఆచూకీ తెలియరాలేదు. గురువారం భాదిత కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రహదారి ప్రమాద ఘటనపై కేసు నమోదు

బూర్గంపాడు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొట్టిన ఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇరువురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం బుధవారం మణుగూరు క్రాస్ రోడ్డు వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... ములకలపల్లి మండలం వీకే రామావరం గ్రామానికి చెందిన సూర్యం, వెంకటేశ్వరరావు అనే ఇరువురు వ్యక్తులు ఈ నెల 12న ద్విచక్ర వాహనంపై మొండికుంట నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో బూర్గంపాడు మండల పరిధిలోని మణుగూరు క్రాస్ రోడ్డు వద్ద వీరి ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని పాల్వంచ నుంచి వస్తున్న లారీ ఢీ కొట్టింది. దీంతో ఇరువురుకి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను భద్రాచలంలోని ఆసుపత్రికి తరలించారు. గురువారం భాదిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## చెల్లని చెక్కు కేసులో 6 నెలలు జైలు శిక్ష

ఖమ్మం లీగల్ మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరం వీడియోస్ కాలనీకి చెందిన చెల్లని చెక్కు కేసులో నిందితుడైన కె.గోపిరవీంద్రనాథ్‌కుమార్‌కి ఆరు నెలలు జైలుశిక్షతో పాటు ఫిర్యాదుకి రెండు లక్షల రూపాయల నష్టపరిహారం కింద చెల్లించాలని ఖమ్మం మద్యపాన ఆబ్కారి ప్రత్యేక న్యాయస్థానం న్యాయాధికారి రాళ్ళబండి శాంతిలత గురువారం తీర్పుచెప్పారు. కేసు వివరాలు ఖమ్మం నగరం రోటరీనగర్‌కు చెందిన బి.వెంకటేశ్వరావు ఫిర్యాది వద్ద 23 ఫిబ్రవరి 2016 నాడు తన అత్యవసర ఖర్చు నిమిత్తం రెండు లక్షల రూపాయలను అప్పుగా తీసుకొని అదేరోజు ప్రాంసరీనోటు రాయించి ఇచ్చినాడు. ఫిర్యాది తన రుణం తిరిగిచెల్లించమని ఒత్తిడిచేయగా నిందితుడు 23 మే 2016న చెక్కు జారీ చేశాడు. ఆ చెక్కును ఫిర్యాది తన బ్యాంకు ఖాతాలో జమచేయగా నిందితుని ఖాతాలో సరిపడ నగదులేనందున చెక్కు తిరస్కరణకు గురైనది. ఫిర్యాది తన న్యాయవాది చుంచు మల్లిఖార్జున్ ద్వారా లీగల్ నోటీసు జారీచేసి కోర్టులో ప్రైవేటుకేసు దాఖలుచేశాడు. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావటంతో పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

**రోడ్డు ప్రమాదంలో కేసులో..**

రోడ్డు ప్రమాదం కేసులో నేరం రుజువు కావటంతో నిందితుడు పావురాల వెంకటనారాయణకు మొదటి అదనపు ప్రథమశ్రేణి న్యాయస్థానం న్యాయాధికారి బెక్కం రజని నిందితుడికి 3 నెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. పోలీసులు కథనం ప్రకారం 9జనవరి2021న ఖమ్మం నగరంలోని చైతన్యనగర్ ప్రాంతంలో నడుచుకుంటూ వెళ్తున్న పోలూరి శ్రీనివాసరావు అనే వ్యక్తిని నిందితుడు పావురాల వెంకటనారాయణ(ప్రభుత్వ జూనియర్ లెక్చరర్) తన వాహనంతో వెనుక నుంచి బలంగా ఢీకొనటంతో తీవ్రంగా గాయపడ్డ శ్రీనివాసరావును హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదుమేరకు పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. కేసులో నిందితుడు అయిన పావురాల వెంకటనారాయణపై నేరం రుజువు కావటంతో మొదటి అదనపు ప్రథమశ్రేణి న్యాయస్థానం న్యాయాధికారి నిందితుడికి 3నెలల జైలుశిక్ష విధించినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో పిటీషనర్ తరపున ఏపీపీ డి.వీరయ్య వాదించగా కోర్టు డ్యూటీ కానిస్టేబుల్ ముత్తయ్యను పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అభినందించారు.

## పెళ్లి వేడుకలో ఘర్షణ

### ఆరుగురికి తీవ్రగాయాలు.. పదిమందిపై కేసు నమోదు

ఖమ్మంక్రైం, మార్చి13(ఆంధ్రజ్యోతి): ఓ పెళ్లి వేడుకలో చిన్న ఘర్షణ జరిగి కర్రలతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్న సంఘటన బుధవారం అర్ధరాత్రి ఖమ్మం నగర పరిధిలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం నగర శివారులోని గోపాలపురంలో బుధవారం వివాహ వేడుక జరిగింది. వేడుక అనంతరం డీజేలు పెట్టి పాటలకు పెండ్లివారి కుటుంబసభ్యులు బంధువులు డ్యాన్సులు వేస్తున్న సమయంలో కొంతమంది యువకులు మద్యంమత్తులో అక్కడే ఉన్న పెండ్లి కూతురు తరపు యువతిపై పడ్డారు. దీంతో సదరు యువతి బంధువులు యువకులను ప్రశ్నించడంతో అక్కడున్న రామ్, విజయ్, నజీర్, నవీన్, బన్నీ, సునిల్, భరత్, గణేష్, అమర్, వీరన్న అనే వారు దాడులకు దిగారు. దీంతో వారిని అడ్డుకుంటుండగా పెండ్లికూతురి సంబంధిత బంధువులపై కర్రలతో, రాళ్లతో దాడిచేశారు గాయపడిన వారిలో మోక్షిత అనే బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. అదేవిధంగా మరో ఐదుగురికి గాయాలుకావడంతో స్థానికులు నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు పోలీసులు తెలిపారు.

## హోలీ సందర్భంగా సిటీ పోలీసు యాక్టు

ఖమ్మంక్రైం, మార్చి13(ఆంధ్రజ్యోతి): హోలీపండుగ సందర్భంగా శుక్రవారం ఖమ్మం కమిషనర్ పరిధిలో సిటీ పోలీసుయాక్టు ఆంక్షలు అమల్లో ఉంటుందని సీపీ సునిల్‌దత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పండుగ వేడుకలు ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ట్రాఫిక్ అంతరాయాలు కలిగించినా, గుంపులుగా తిరుగుతూ పరిచయంలేని వారిపై రంగులు చల్లడం చేసినా, గొడవలు సృష్టించనా చర్యలు తప్పవన్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు చర్యలలో భాగంగా నేడు ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. ప్రధాన కూడళ్లతోపాటు సాగర్‌కెనాల్, మున్నేరు రిజర్వాయర్లవద్ద పోలీసుబందోబస్తు ముమ్మరం చేయాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు శుక్రవారం మద్యం విక్రయాలపై నిషేధం విధిస్తూ ఆదేశాలు జారీచేశామని ఉదయం 6గంటలనుంచి సాయంత్రం 6గంటల వరకు మద్యం అమ్మకాలు నిలిపివేయాలని వైన్‌షాపుల యజమానులకు సూచించారు.

## సైబర్ మోసం

### వ్యక్తి ఖాతా నుంచి రూ.3.50లక్షల నగదు మాయం

కూసుమంచి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు కొత్తపుంతలు తొక్కుతున్నాయి. పీఎం కిసాన్ నుంచి డబ్బులు పడ్డాయా లేదో తెలుసుకునేందుకు ప్రయత్నించి రెండుసార్లు నగదు పోగొట్టుకొని ఓ వ్యక్తి మోసపోయాడు. ఈ ఘటన ఖమ్మంజిల్లా కూసుమంచి మండలం తుర్కగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుని కథనం ప్రకారం తుర్కగూడెం గ్రామానికి చెందిన పుసులూరి ఉపేందర్ చౌదరి తనకున్న వ్యవసాయంతో పాటు వరికోత మిషన్ల ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల యాసంగి వరి కోతలు దగ్గరపడుతుండటంతో వరికోత మిషన్ల యజమానులకు అడ్వాన్సులు చెల్లించేందుకు నగదు బ్యాంకులో నిల్వ చేసుకున్నాడు. ఈ క్రమంలో ఈనెల 9తేదీన వాట్సప్‌కు పీఎం కిసాన్ పేరున ఒక లింక్ వచ్చింది. మీ అకౌంట్లలో డబ్బు వచ్చిందో లేదో తెలుసుకునేందుకు లింక్ ఓపెన్‌చేసి వివరాలు నమోదుచేసుకోవాలని దాని సారాంశం. దీంతో వెంటనే ఉపేందర్ లింక్ ఓపెన్‌చేసి తన పేరు, ఆధార్ నెంబర్, ఫోన్‌నెంబరు పలు సార్లు నమోదుచేసాడు. అనంతరం 10తేదీన బ్యాంకు బ్యాలన్స్ చూసుకోగా రూ.2లక్షలు తక్కువగా కనిపించాయి. మరికొంత సేపటికి రూ.1.50లక్షలు కట్ అయినట్లుగా మెస్సేజ్ వచ్చింది. దీంతో ఆందోళన చెంది వెంటనే బ్యాంకు అధికారులను సంప్రదించి వెంటనే అకౌంట్‌ను బ్లాక్ చేయించాడు. మొత్తం రూ.3.50 లక్షలు మాయం కావడంతో బాధితుడు లబోదిబో అంటున్నారు. అనంతరం కూసుమంచి పోలీసులను, సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మొబైల్ ఫోన్లలో ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని అలాంటి కేటుగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నాగరాజు కోరారు.

## పోగొట్టుకున్న నగదు అందజేత

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి13(ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న నగదు ఖాతాదారుడికి అందజేసిన సంఘటన కొత్తగూడెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. చుంచుపల్లి మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన కుమారస్వామి ఏటీఎంలో నగదును రూ.4 వేలు విత్‌డ్రా చేసుకొని జేబులో పెట్టుకొని వెళ్లిపోయాడు. కానీ ఆ నగదు వెనుక జేబులో వేసే క్రమంలో అవి జారి పడి ఏటీఎం ఉన్న గదిలోనే నగదు పడిపోయాయి. ఈ క్రమంలో అక్కడే ఉన్న కోర్టు కానిస్టేబుల్ అహ్మద్ పాషా గమనించి ఆ నగదు ఎవరిదో అని విచారణ చేసి ట్రాఫిక్ ఎస్ఐ మదార్ ఆధ్వర్యంలో వ్యక్తికి అందజేశారు. దీంతో నగదు పోగొట్టుకున్న తనకు పోలీసులకు తిరిగి ఇచ్చినందుకు కుమారస్వామి ధన్యవాదాలు తెలిపారు.






## శ్రీరాజగోపాలస్వామి కల్యాణం నేడు

నేలకొండపల్లి, మార్చి13(ఆంధ్రజ్యోతి): వార్షిక అధ్యయనోత్సవ సహిత బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేలకొండపల్లిలోని అత్యంత ప్రాచీనమైన శ్రీరాజగోపాలస్వామి వారి ఆలయంలో స్వామివారి కల్యాణం శుక్రవారం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి కాముని శ్రీకాంత్, అర్చకుడు ముడుంబా రామానుజాచార్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.శుక్రవారం సాయంత్రం పూర్ణాహుతి, బలిహరణము అనంతరం 7గంటలకు శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీరాజగోపాలస్వామి తిరుకల్యాణం నిర్వహించనున్నట్లు చెప్పారు.భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కల్యాణం విజయవంతం చేయాలని శ్రీకాంత్, రామానుజాచార్యులు ప్రకటనలో కోరారు.

## పారిశుధ్య పనులు పరిశీలించిన కమిషనర్


సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంసంక్షేమ విభాగం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని 48, 57 డివిజన్లలో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య గురువారం విస్తృతంగా పర్యటించారు. ఎప్‌సీఐ గోడౌన్ నుంచి డివైడర్లు, ప్రధాన రహదారులు, ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, బస్తీ దవాఖానలను తనిఖీ చేశారు. అక్కడ ఉన్న చెత్తను తొలగించాలని పారిశుధ్య పర్యవేక్షకులకు ఆదేశాలిచ్చారు. రెండు రోజులు పాటుగా గ్యాంగ్ వర్క్ ఏర్పాటు చేసి పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. పలు నివాసాలను పరిశీలించి స్థానికంగా ఉన్న సమస్యలను మహిళలతో మాట్లాడి కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలుసుకున్నారు. ఈఈ కృష్ణలాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**లైసెన్స్‌లేని వ్యాపారులకు జరిమానా**

ఖమ్మం నగరంలోని కమర్షియల్ ప్రాంతాల్లో కేఎంసీ ఉద్యోగులు ప్రత్యేక లైసెన్స్ రెన్యూవల్స్ కార్యక్రమం నిర్వహించారు. లైసెన్స్‌లు రెన్యూవల్స్ కాని వ్యాపారులకు తక్షణం రెన్యూవల్స్ చేయించి వారితో ఫీజులు కట్టించారు. ఆదర్శ్ ఫ్యాషన్స్, ఆర్ఎస్ ఫ్యాషన్స్, తెలంగాణ ఏజెన్సీ వారు వ్యాపారలైసెన్స్ తీసుకోకపోవటంతో ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున జరిమానా విధించారు.

## ఏఐ తరగతులను సమర్థంగా నిర్వహించండి

**డీఈవో సోమశేఖరశర్మ**

నేలకొండపల్లి,మార్చి13(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో నిర్వహిస్తున్న కృత్రిమ మేధ తరగతులను సమర్థంగా నిర్వహించాలని జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ అన్నారు. గురువారం మధ్యాహ్నం డీఈఓ సింగారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలను తనిఖీచేశారు. కృత్రిమ మేధ తరగతులను అభ్యసిస్తున్న విద్యార్థుల శక్తి,సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో చలపతిరావు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం రమేష్, పాఠశాల హెచ్ఎం హరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# 18లోపు భక్తరామదాసు నీటివిడుదల

- రైతులకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ భరోసా
- ఖమ్మంరూరల్ మండలంలో పంటల పరిశీలన
- ఆయిల్‌ఫామ్ సాగుపై దృష్టి సారించాలని సూచన


తల్లంపాడులో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంరూరల్,మార్చి13(ఆంధ్రజ్యోతి):భక్తరామదాసు నీరు అందక మొక్కజొన్న పంట ఎండిపోతోందని రైతులు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ దృష్టికి తీసుకు వెళ్లారు.. స్పందించిన ఆయన 18వ తేదీలోగా నీటిని విడుదల చేస్తామని భరోసా ఇచ్చారు. ఖమ్మంరూరల్ మండలం, తల్లంపాడులో గురువారం కలెక్టర్ స్వయంగా పంటలను పరిశీలించారు. పంటల నీటి అవసరాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఆయిల్ పామ్ పంటలను డ్రిప్ ద్వారా పండించేలా మొగ్గు చూపాలని రైతులకు సూచించారు. పదిమంది రైతులు కలిసి ఇంకుడు గుంటలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలు ఎంత దిగుబడి వస్తుందని రైతులను అడిగి తెలుసుకున్నారు.ఏటా ఒకేరకం పంటలు కాకుండా పంట మార్పిడి చేయాలన్నారు. రెండు మూడు రకాల పంటలు సాగు చేయడం ద్వారా ఒక దానిలో నష్టం వచ్చినా మరో దానిలో కలిసి వస్తుందన్నారు. దాని వలన రైతుకు ఎలాంటి నష్టం వాటిల్లదని ఎక్కువ లాభాలు ఉంటాయని కలెక్టర్ ముజిమ్మిల్‌ఖాన్ రైతులకు సూచించారు.ఎస్ఆర్ఎస్పీ కాలువల ద్వారా పంటలకు వెంటనే నీరు అందించాలని ఎన్నెస్పీ అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సరిత, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

**అంబులెన్స్ అందించిన ఆర్ఐఎన్ఎల్ సంస్థ**

ఖమ్మంకలెక్టరేట్: మారుమూల ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఆర్ఐఎన్ఎల్ సంస్థ అంబులెన్స్ అందజేసింది. గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఆర్ఐఎన్ఎల్ సంస్థ అందించిన అంబులెన్స్‌ను కలెక్టర్ ప్రారంభించారు. కామేపల్లి, కారేపల్లి మండలంలోని గ్రామీణ ప్రజలకు వైద్యసేవలను సత్వరం అందించేందుకు ఉపయోగపడే విధంగా సంస్థ కార్పొరేట్ సోషల్‌రెస్పాన్స్ బులిటీ కింద అంబులెన్స్ అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐఎన్ఎల్ మాధారం డోలమైట్ మైన్ డీజీఎం, ఇంచార్జ్ మైన్స్‌బీయూవీఎన్ రాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కళావతిబాయి,ఆర్ఐఎన్ఎల్.హెచ్. ఆర్.సీనియర్ మేనేజర్ పి.చిట్టి రాజు పాల్గొన్నారు.

## మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంకలెక్టరేట్,మార్చి13(ఆంధ్రజ్యోతి): మహిళలకు అన్నిరంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.గురువారం కలెక్టరేట్ అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి పద్మశ్రీతో కలిసి వేడుకలను కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. బేటీబచావో, బేటీ పడావో పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. బీసీ సంక్షేమ అధికారి జ్యోతి, ఉపాధి కల్పన అధికారి మాధవి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ భారతి తదితరులు పాల్గొన్నారు. 2024లో 10/10 జీపీఏ. సాధించిన పదోతరగతి, ఇంటర్, వివిధ క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచిన,ఎస్‌సీసీ విద్యార్థినులకు మెమెంటోలను డీఆర్వో. పద్మశ్రీ అందజేశారు.

# 27న బార్ అసోసియేషన్ ఎన్నికలు

- రేపు తుది ఓటర్ల జాబితా
- ఎన్నికల అధికారిగా సోమశేఖరశర్మ



ఓటు అభ్యర్థిస్తున్న పోటీలో ఉన్న అభ్యర్థి, ఎన్నికల అధికారి సోమశేఖరశర్మ

ఖమ్మంలీగల్,మార్చి13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బార్‌కౌన్సిల్ ఆదేశానుసారం ఈ నెల 27న ఖమ్మం బార్‌అసోసియేషన్ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈనెల15న తుదిఓటర్ల జాబితా ప్రకటన, అభ్యర్థుల నామినేషన్ దాఖలు మార్చి17 నుంచి 20 వరకు, నామినేషన్ల పరిశీలన అనంతరం పోటీ అభ్యర్థుల ప్రకటన మార్చి 21 ఉంటుంది. 22న నామినేషన్ల ఉపసంహరణ, 27న ఎన్నిక, ఫలితాల అనంతరం నూతన కార్యవర్గం ఏప్రిల్ 1న ఏర్పాటు చేయబడుతుందని ఖమ్మం బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి చింతనిప్పు వెంకట్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా సీనియర్ లాయర్ సర్వదేవభట్ల సోమశేఖరశర్మ నియమితులయ్యారు.

**ఉత్సాహంగా ప్రచారం**

ఏటా జరిగే న్యాయవాదసంఘం ఎన్నికలలో పోటీదారులు ఉత్సాహంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గతవారం న్యాయవాద సభ్యత్వ నమోదు చేశారు.సుమారు 850మంది నమోదు చేయించుకున్నారు. ఈ సారి ఎన్నికల్లో అధ్యక్ష బరిలో తొండపు వెంకటేశ్వరరావు, శుగ్గల వెంకటేశ్వరగుప్తా, అయ్యదేవర విజయరాఘవ ఉపాధ్యక్ష పదవికి షేక్ జానీమియా, మోతుకూరి విజయశాంతి, మల్లం రవిప్రసాద్,ప్రధాన కార్యదర్శి పదవికి తెల్లాకుల రమేష్‌బాబు,గద్దల దిలీప్‌కుమార్, గ్రంథాలయ కార్యదర్శి పదవికి దేవరకొండ కళ్యాణి, సింగారపు రాంబాబు, క్రీడల కార్యదర్శిగా కేవివి లక్ష్మి, ధరావత్ రాందాస్‌నాయక్, ఉప కార్యదర్శి పదవికి మేకల నవీన్‌కుమార్, కోశాధికారిగా పొన్నెకటంటి నరసింహారావు పోటీలో ఉన్నారు. వాట్సాప్ మెసేజ్‌లతో పాటు ప్రత్యక్షంగా న్యాయవాద ఓటర్ల ఇంటికి వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. తమని గెలిపిస్తే న్యాయవాదుల సమస్యలపట్ల అంకితభావంతో పని చేస్తామని హామీలు గుప్పిస్తున్నారు. కొందరు అభ్యర్థులు ఇప్పటికే డబ్బును విపరీతంగా ఖర్చు చేస్తున్నారు.

## మందులు, ఆపరేషన్ పరికరాల సరఫరాకు టెండర్లు

ఖమ్మంకలెక్టరేట్, మార్చి13(ఆంధ్రజ్యోతి): ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి కావాల్సిన మందులు, శస్త్రచికిత్సకు అవసరమయ్యే పరికరాల, ప్రయోగశాల రసాయనాలు, కారకాలు, ఆర్థో ఇంప్లాంట్లు, క్యాత్-ల్యాబ్ ఇంప్లాంట్లు సరఫరాకు రెండు సంవత్సరాల కాల పరిమితితో టెండర్స్ ఆహ్వానిస్తున్నట్లు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్. కిరణ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్న ఏజెన్సీలు దానికి సంబంధించిన టెండర్ ఫారాలను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ పేరున 10వేల రూపాయలు డిమాండ్ డ్రాఫ్ట్/బ్యాంకర్స్ చెక్ రూపంలో చెల్లించి మార్చి 20 లోగా కార్యాలయ అన్ని పని వేళల్లో పొందాలని, పూర్తి చేసిన టెండర్ ఫారాలను తిరిగి ఏప్రిల్ 11లోగా అందజేయాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## తరుణి హట్‌లోకి ఏదులాపురం మునిసిపల్ కార్యాలయం


మునిసిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న దయాకర్‌రెడ్డి

ఖమ్మంరూరల్, మార్చి13(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపల్ కార్యాలయాన్ని వరంగల్ క్రాస్‌రోడ్‌లోని తరుణిహట్‌లో ఏర్పాటు చేయనున్నారు. నూతనంగా ఏర్పడిన ఈ మునిసిపల్ కార్యాలయానికి ప్రత్యేక కార్యాలయం లేదు. ప్రస్తుతం ఏదులాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. అయితే పరిపాలన సౌలభ్యంకోసం ఈ నిర్ణయం తీసుకున్నారు.అందులో భాగంగా మండల ప్రత్యేకాధికారి రమేష్, మున్సిపల్ కమిషనర్ షఫీఉల్లా, కాంగ్రెస్ జిల్లా నాయకుడు తుంబూరి దయాకర్ రెడ్డి, మంత్రి పీఏ రఘురాంరెడ్డి గురువారం తరుణిహట్ ప్రాంగణాన్ని పరిశీలించారు. అధికారులతో మాట్లాడారు. మున్సిపాలిటిలో ఎల్ఆర్ఎస్, జనన, మరణ ధ్రువపత్రాలు, ఇంటి అనుమతులు, పన్నులు, అధికారులకు సంబంధించిన విధులు, ప్రజలకు ఏవిధమైన సేవలు అందిస్తున్నారు. అనేవిషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సంబంధంచిన సర్టిఫికెట్లు వెంటనే అందించేందుకు చర్యలు తీసుకోవాలన అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వీలైన తొందరలోనే తరుణి హట్ ప్రాంగణలోకి మున్సిపాలిటి కార్యాలయాన్ని మార్చనున్నట్లు వారు పేర్కొన్నారు.

## తాగునీటి ఇబ్బందులపై ఫిర్యాదు

తిరుమలాయపాలెం, మార్చి13(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెట్టెలపాడులో తాగునీటికోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఐదురోజులగా తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామస్తులు గురువారం ఎంపీడీవో సిలార్‌సాహెబ్‌కు ఫిర్యాదు చేశారు. తాగునీటి సరఫరా కాకుండా కొందరు అడ్డుకుంటున్నారని తెలిపారు.

## 17నుంచి 26వరకు కార్పెంటర్ల బంద్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్పెంటర్లు

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి13(ఆంధ్రజ్యోతి): ఈనెల17నుంచి 26వరకు బంద్ నిర్వహిస్తున్నట్లు కార్పెంటర్స్ యూనియన్ల జేఏసీ ఖమ్మం కన్వీనర్ బానాల చిన్న వీరబ్రహ్మాచారి పేర్కొన్నారు. కార్పెంటర్ల మేస్త్రీలకు పనికి తగిన వేతనం ఇవ్వాలని కోరుతూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో బంద్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. మెటీరియల్ ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. కానీ యజమానులు మాత్రం ఎన్నో ఏళ్ల క్రితం ఇస్తున్న ధరలనే ఇస్తున్నారన్నారు. ఖమ్మంలోనికార్పెంటర్స్ సంఘాలన్ని ఒకేతాటిపైకి వచ్చి జేఏసీ ఏర్పడి నిర్ణయించామన్నారు. ఈకార్యక్రమంలో కార్పెంటర్స్ అసోసియేషన్ ఖమ్మం అధ్యక్షుడు బానాల వీరబ్రహ్మాచారి, సోమా నాగరాజు కుమార్, దోసోజు పాపాచారి, దిగజర్ల వెంకన్న పాల్గొన్నారు.

## సీసీ రహదారులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న మేయర్

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మంత్రితుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో ఖమ్మం నగరం అభివృద్ధి జరుగుతుందని, మారుమూల వీధులకు సైతం సీసీ రహదారులు మంజూరు చేయిస్తున్న ఘనత తుమ్మలదే అని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. గురువారం ఖమ్మంలోని 46వ డివిజన్‌లో సీసీ రహదారులకు ఆమె శంకుస్థాపన చేశారు. నగర ప్రజలు తడి, పొడి, ప్లాస్టిక్ వ్యర్థాలను విడివిడిగా పారిశుధ్య సిబ్బందికి ఇవ్వాలని, క్లీన్‌ఖమ్మానికి ప్రజలు సహకరించాలని కోరారు.స్థానిక కార్పొరేటర్ కన్నెం వైష్ణవి, కాంగ్రెస్ నాయకులు కన్నెం ప్రసన్నకృష్ణ, డివిజన్ అధ్యక్షుడు షేక్ రజ్జి, సింగం అంజయ్య, తోగరు బాస్కర్, బాల్దే నాగేశ్వరరావు, కాటం కోమరయ్య, కాటం యాదయ్య, జెట్ట కృష్ణయ్య, శనిగరం ఉప్పలయ్య, దేవర వెంకన్న, చంద్రమ్మ, నరుగుల బలారంశంకర్, మంగ యాదయ్య, ఊరుకూరి ఆంజనేయులు, దాచేపల్లి మల్లయ్య, బుంగ శ్రీనివాస్, కేసోజ్ వీరాచారి పాల్గొన్నారు.

# చెరుకు రైతులకు పంచదార పంపిణీ

- మధుకాన్ షుగర్స్‌లో ప్రారంభించిన ఎండీ కృష్ణయ్య


రైతులకు పంచదారను పంపిణీ చేస్తున్న మధుకాన్ షుగర్స్ ఎండీ కృష్ణయ్య

నేలకొండపల్లి,మార్చి13(ఆంధ్రజ్యోతి): మధుకాన్ షుగర్స్‌కు చెరుకు సరఫరా చేసిన రైతులు గురువారం ఫ్యాక్టరీలో పంచదార పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎండీ నామా కృష్ణయ్య ప్రారంభించారు. చెరుకు నాటే రైతులకు అన్ని రకాల రాయితీలను అందచేస్తున్నామని చెప్పారు. 2024-2025 క్రషింగ్ సీజన్‌లో ఫ్యాక్టరీకి చెరుకును సరఫరా చేసిన రైతులకు మెట్రిక్ టన్నుకు పావు కేజీ పంచదార చొప్పున అందజేశారు. రైతులు ఫ్యాక్టరీ పరిధిలో పెద్ద మొత్తంలో చెరుకును నాటిఫ్యాక్టరీ అభివృద్ధికి సహకరించాలన్నారు. చెరుకు రైతుల అభివృద్దే ధ్యేయంగా ఫ్యాక్టరీ యాజమాన్యం నిరంతరం పని చేస్తున్నదన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా చెరుకుకు ఎక్కువగా మద్దతు ధరను చెల్లిస్తున్నది మధుకాన్‌షుగర్స్ అన్న విషయాన్ని రైతులు గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు నెల్లూరి భద్రయ్య, తలశీల గోపాలరావు, సూరపనేని రామకృష్ణ, దండా రంగయ్య, చింతనిప్పు సైదులు,జటంగి వెంకన్న, బోనగిరి కిరణ్, ఇంటూరి అశోక్, అధికారులు కోటయ్య, వెంకటేశ్వర్లు,అప్పారావు పాల్గొన్నారు.

## గ్రంథాలయానికి అదనపు సౌకర్యాలు

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పాత మున్సిపాల్ కార్యాలయంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయానికి అదనపు సౌకర్యాలు కల్పించారు. త్రాగునీరు, కాంపిటేటివ్ పుస్తకాలు, ఏసీలను ఏర్పాటు చేశారు. ఇంటర్నెట్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. సీసీ కెమెరాలు అమర్చారు. గాంధీ లైబ్రరీ, జమలాపురం కేశవరావు లైబ్రరీ, మహిళా గ్రంథాలయాలకు త్వరలో వసతులు కల్పిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు.

# పశువైద్యశిబిరం విజయవంతం


గొర్రెలు, మేకలకు చికిత్స చేస్తున్న పశు వైద్య సిబ్బంది

నేలకొండపల్లి,మార్చి13(ఆంధ్రజ్యోతి):జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, గోపాలమిత్రలు గురువారం మండల పరిధిలోని కట్టుకాసారంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరం విజయవంతమైంది. 15పశువులకు సాధారణ జబ్బులకు చికిత్స చేశారు. 52 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. 100 గొర్రెలకు నట్టల నివారణ మందును తాగించారు. అనంతరం లేగదూడల ప్రదర్శనను నిర్వహించి, బహుమతులను అందచేశారు. శిబిరంలోడాక్టర్ రూప్‌కుమార్ చికిత్స అందించగా గోపాలమిత్రులు బోయపాటి నారాయణ, నాగేశ్వరరావు, వెంకట్రావు, నర్సింహారావు, తాజ్ పాషా, నాగరాజు, పాండురంగయ్య సహకరించారు. శిబిరంలో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని శిబిరం విజయవంతం గావటానికి సహకరించారు. గోపాలమిత్ర సూపర్‌వైజర్లు శంకరయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## కరెన్సీనోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి13 (ఆంధ్రజ్యోతి): కరెన్సీనోట్లపై అంబేద్కర్ ఫోటో ముద్రించాలని కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జెర్రిపోతుల పరుశురాం డిమాండ్ చేశారు.గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఛలో ఢిల్లీపోస్టర్ ఆవిష్కరించారు. 26నఢిల్లీలో జరిగే ధూంధాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆసంఘం సాంస్కృతిక విభాగం జాతీయ కన్వీనర్ గట్టగల్ల సంజీవరావు, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్రునాయక్, కంబంపాటా రాజారత్నం పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరాకు నిరంతర విద్యుత్

ఖమ్మంరూరల్, మార్చి13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆరెంపులలో వేసవికాలంలో ఏటా తాగు నీటి ఎద్దడి ఏర్పడుతోంది. గొల్లగూడెం సాగర్ కాలువ పక్కనుండి బోరు ద్వారా బారుగూడెం మీదుగా ఆరెంపుల గ్రామానికి తాగు నీరు అందిస్తున్నారు. అయితే విద్యుత్ సౌకర్యం సరిగా లేకపోవడం, కొంతకాలంగా ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దానికి మరమ్మతులు చేయకపోవడంతో విద్యుత్ సమస్య తలెత్తి తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈఏడాది కూడా అట్టి సమస్య రాకుండా ఉండేందుకు సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బండి జగదీష్ కొత్తట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారు. 24గంటల విద్యుత్ కనెక్షన్ అందించాలని విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించారు. స్పందించిన అధికారులు గురువారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు.దీంతో ఆరెంపుల గ్రామానికి వేసవిలో తాగునీటి ఎద్దడి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్లయింది. ఈ కార్యక్రమంలో లైన్‌ఇన్‌స్పెక్టర్ రామారావు, లైన్‌మెన్ శ్రీనివాస్‌రావు, గ్రామ పెద్దలు బండి జగదీష్, రవి,దావూద్, రమణా, విజయ్ రెడ్డి, మహేష్ రెడ్డి పాల్గొన్నారు.


ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

## రాములోరి కల్యాణానికి జల్లేపల్లి నుంచి తలంబ్రాలు


ధాన్యాన్ని వలుస్తున్న భక్తులు

తిరుమలాయపాలెం,మార్చి13(ఆంధ్రజ్యోతి): మండలంలోని జల్లేపల్లి నుంచి భద్రాచలం సీతారామ కల్యాణానికి తలంబ్రాలను బుధవారంరాత్రి తీసుకెళ్లారు. ఫిబ్రవరిలో భద్రాచల నుంచి వడ్లు తెచ్చి జల్లేపల్లి రామభక్తులు గోటితో వలిచారు. శ్రీరామాంజనేయ స్వామి ఆలయంలో గ్రామానికి చెందిన సుమారు 15మంది మహిళలు ఈ తలంబ్రాలను తయారు చేశారు. బుధవారం రాత్రి ఊరేగింపుగా తలంబ్రాలు తీసుకెళ్లారు. రెండేళ్లగా ప్రకాశం జిల్లా నుంచి తెచ్చిన ధాన్యాన్ని గోటితో తలంబ్రాలు చేసి కల్యాణానికి ఇచ్చే ఆనవాయితీ ఉంది.. ఈఏడాది భద్రాచలం శ్రీరాముడి భూములలో పండిన వడ్లను తెచ్చి గోటితో వలిచి తలంబ్రాలు తయారు చేసి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో రమ,నీలిమ, వినోద, కళ్యాణి, సునీత, లత, పొట్ల జగదీష్, దివ్వెల శ్రీనివాస్, పొట్ల వాసుదేవరావు, పొట్ల నాగన్న, ఉపేందర్, వీరస్వామి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


తలంబ్రాలు తీసుకెళుతున్న భక్తులు

## నా రాజకీయ దిశా నిర్దేశకుడు గాదె సత్యం: మంత్రి తుమ్మల



గాదె సత్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సత్తుపల్లి, మార్చి13 (ఆంధ్రజ్యోతి): తాను రాజకీయాలలో వచ్చినప్పటి నుంచి ఎప్పటికప్పుడు రాజకీయ పరిస్థితులు, నడవడిక, రాజకీయ విశ్లేషణపై దిశానిర్దేశం చేసిన వ్యక్తి గాదె సత్యనారాయణ అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం గాదె సత్యనారాయణ దశదిన కర్మ సందర్భంగా సత్తుపల్లిలో ఏర్పాటుచేసిన సంస్మరణ సభలో తుమ్మల మాట్లాడుతూ గాదె సత్యం మృతి తనను తీవ్రంగా కలచి వేసిందంటూ భావోద్వేగానికి గురయ్యారు. తనకు ఎప్పటికప్పుడు సలహాలు ఇచ్చి వెన్నంటి ఉన్న నాయకుడు గాదె సత్యం అన్నారు. ఆయన సలహా, మార్గనిర్దేశంతో తన రాజకీయ ప్రయాణం సాగిందన్నారు. ఈ కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ తదితరులు ప్రసంగించారు.

గాదె సత్యనారాయణ దశదిన కర్మ సందర్భంగా కాకర్లపల్లి రోడ్డులో ఆయన నివాసంలో పలువురు నివాళులర్పించారు. టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గాదె సత్యనారాయణ చిత్రపటానికి పూలుజల్లి మౌనం పాటించారు. ఆయన వెంట మునిసిపల్ మాజీ చైర్మన్ కూసంపూడి మహేష్ ఉన్నారు.

## ఘనంగా వేంకటేశ్వరస్వామి దివ్య రథోత్సవం

వేంసూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వేంసూరు మండలం కందుకూరు వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారి దివ్య రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్‌విజయ్‌కుమార్ వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కందుకూరు అన్నదాన సేవసమితి ఆధ్వర్యంలో మహాఅన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఆలయ ఈవో వీఎల్‌వీ.వెంకట్రావ్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు కొనసాగుతున్నాయి.



వేంసూరులో స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

**ఎడ్లబండలాగుడు పోటీలు**

కందుకూరు వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాల సందర్భంగా జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలు గురువారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయ్‌కుమార్ ప్రారంభించారు. కేటగిరి విభాగంలో ఆరుజట్ల ఎడ్లు పాల్గొన్నాయి. పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ఎడ్లబండ లాగుడు పోటీలను ఆసక్తిగా తిలకించారు.



పోటీలను ప్రారంభిస్తున్న మట్టా దయానంద్



కారేపల్లిలో వేంకటేశ్వరస్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**కారేపల్లిలో..**

కారేపల్లి, మార్చి13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోగల వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం శ్రీలక్ష్మీపద్మావతి సహిత వేంకటేశ్వరస్వామివారి కల్యాణం వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో నల్లమోతు శేషయ్య, సిబ్బంది మూడు మోహన్ చౌహాన్ ఆధ్వర్యంలో అర్చకులు సతీష్ నేతృత్వంలో స్వామివారి కల్యాణం జరిపించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## ఉపాధి హామీ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఏపీడీ శ్రీదేవి

ముదిగొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలంలోని న్యూలక్ష్మీపురం, అమ్మపేట గ్రామాల్లో 2024-2025సంవత్సరానికిగానూ చేపట్టిన ఉపాధి హామీ పనులను ఏపీడీ శ్రీదేవి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వందరోజులను చట్టపరంగా పనిదినాలు కల్పించి వేతనాలు అందించాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో రంగనాయకమ్మ, సెక్రటరీ సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ రాధాకృష్ణ, స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

## విరాళం అందజేత

మధిర రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం రాయపట్నం గ్రామంలోగల ప్రభుత్వ యూపీఎస్ పాఠశాల అభివృద్ధికి రూ.2.50లక్షల విరాళాన్ని తేళ్ల సుకుమోటో ఫౌండేషన్ వారు అందజేశారు. పాఠశాలకు అవసరమైన గ్రిల్స్, ప్రహరీ పెన్సింగ్ కోసం ఈ విరాళాన్ని ఇచ్చారు. ఆచెక్కును పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి ఫౌండేషన్ సభ్యుడు తేళ్ల సత్యనారాయణ అందజేశారు. ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## శేషగిరిరావుకు నివాళి

మధిర రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీనగరం గ్రామానికి చెందిన వాసిరెడ్డి శేషగిరిరావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. టీపీసీసీ స్టేట్ కోఆర్డినేటర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఖమ్మం గ్లోబల్ ఫౌండేషన్ అధ్యక్షుడు జెట్టి కుసుమకుమార్ గురువారం అల్లీనగరం గ్రామానికి వెళ్లి శేషగిరిరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసిరెడ్డి నరేష్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు భానుప్రసాద్, టీపీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్, టీపీసీసీ సోషల్ మీడియా సెక్రటరీ జంగా శ్రీనివాసరావు, న్యాయవాది యన్నం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

మధిరటౌన్, మార్చి13: మధిర డివిజన్ ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మధిరలో ఫొటోగ్రాఫర్లకు యశోద ఆస్పత్రి వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకన్న ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, కటుకూరి శ్యామారావు, పార్వతి, శ్రీధర్, నాగభూషణం, అంగడాల గోపి తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-2కు ఎంపిక



సుధాకర్‌రావు

మధిర రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలం దేశినేనిపాలెం గ్రామానికి చెందిన మందలపు సుధాకర్‌రావు గ్రూప్-2 పరీక్షా ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 74వ ర్యాం కు సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. 397మార్కులతో ఈ అర్హత సాధించాడు. నవంబరులో విడుదలైన గ్రూపు-4 ఫలితాల్లో కూడా 2వేల ర్యాంకు సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ప్రస్తుతం సుధాకర్‌రావు ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్‌లో వార్డు అధికారిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ ఉద్యోగం చేస్తూనే గ్రూపు-2 రాసి 74వ ర్యాంకు సాధించడం విశేషం. సామాన్య రైతు కుటుంబంలో పుట్టి గ్రూపు-2 ఉద్యోగం సాధించడం పట్ల తల్లిదండ్రులు శ్రీనివాసరావు, కుమారి, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌రావు మాట్లాడుతూ తల్లిదండ్రుల కష్టం, స్నేహితుల ప్రోత్సాహంతోనే కష్టపడి చదివి గ్రూపు-2 సాధించానని తెలిపాడు.

## పరీక్ష సామగ్రి పంపిణీ

కల్లూరు, మార్చి13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నకోరుకొండి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వైరా లయన్స్‌క్లబ్ అ ధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా పీఎంజేఎఫ్ మదన్మోహన్ సహకారంతో విద్యార్థులకు రూ.15 వేల విలువ సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రామయ్య, చింతోజు నాగేశ్వరరావు, తాటికొండ రాము, బుచ్చిరామారావు, ఈవూరి నరిసింహారావు, రామారావు, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

**ముదిగొండలో...**

ముదిగొండ: మండలంలోని పమ్మి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ పరిశ పుల్లయ్య, ప్రధానోపాధ్యాయుడు హరిప్రసాద్, క్లస్టర్ రిసోర్స్‌పర్సన్ ప్రవీణ్, పరిశ పుల్లయ్య పాల్గొన్నారు.

## తప్పిన ప్రమాదం

» చెట్టు కొమ్మలు పడి విరిగిన విద్యుత్ స్తంభాలు

తల్లాడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీనగర్ వద్ద తల్లాడ-భద్రాచలం ప్రధాన రహదారి పక్కనున్న చెట్టుకు గుర్తుతెలియని వ్యక్తి నిప్పంటించాడు. చెట్టు కాలి నేలకొరిగింది. చెట్టుకొమ్మలు సమీపంలో ఉన్న 33కేవీ విద్యుత్ లైన్‌పై పడటంతో ఒక స్తంభం పూర్తిగా ఒరిగిపోగా, మరో స్తంభం నేలకూలింది. ఈ ధాటికి విద్యుత్ లైన్లు చిన్నాభిన్నం అయిపోయాయి. ఎన్‌పీడీసీఎల్ ఏఈ రాయల ప్రసాద్ సంఘటనాస్థలానికి చేరుకొని విద్యుత్ లైన్లను పునరుద్ధరించారు.

## 18న బహిరంగ వేలం

ఏన్కూరు, మార్చి13(ఆంధ్రజ్యోతి): గార్లొడ్డు శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవాలయ ప్రాంగణం నందు లడ్డూప్రసాదం పులిహోర విక్రయించేందుకు ఈనెల 18న మంగళవారం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో ఎస్‌వీడీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు దేవాలయ ప్రాంగణం నందు వేలం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తికల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

## లక్కినేని కుటుంబానికి సండ్ర పరామర్శ



శాంతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

కల్లూరు, మార్చి13 (ఆంధ్రజ్యోతి) సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గురువారం కల్లూరులో అడిషనల్ కలెక్టర్ (నిర్మల్‌జిల్లా) లక్కినేని కిషోర్ కుటుంబాన్ని పరామర్శించారు. కిషోర్ మాతృమూర్తి లక్కినేని శాంతమ్మ ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు సమాచారం అందుకొని కుమారులైన ఎల్‌వీ ప్రసాద్, లక్కినేని కిషోర్‌లను సండ్ర కలుసుకొని సంతాపం తెలిపారు. శాంతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకులు లక్కినేని రఘు, కనగాల వెంకట్రావు, సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ బోబోలు లక్ష్మణరావు, కాటంనేని వెంకటేశ్వరరావు, కొరకొప్పు ప్రసాద్, సిహెచ్ కిరణ్, ఉబ్బన వెంకటరత్నం, సయ్యద్ రఫూఫ్ బీరెల్లి పురుషోత్తం, రామవరపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నిరంతరాయంగా విద్యుత్ సరఫరా: డీఈ

చింతకాని, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వేసవిలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేస్తామని డీఈ నంబూరి రామారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన 63 కేవీ నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడీఈ తిలక్, ఏఈ శ్రీధర్ పాల్గొన్నారు.

## దివ్యాంగులకు బస్‌పాస్‌ల అందజేత

కల్లూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు రాయితీపై అందిస్తున్న బస్‌పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలని సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి చెప్పారు. గురువారం మండల పరిధిలోని పేరువంచ గ్రామంలో విశ్రాంత హెచ్‌ఎం కీసర మోహనరెడ్డి ఆర్థిక సహకారంతో దివ్యాంగులకు బస్‌పాస్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, విలేజ్ బస్‌ఆఫీసర్ కిన్నెర ఆనందరావు, సిబ్బంది సాంసన్, రత్నాకర్, పరిమి భరత్, కీసర శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా విజేతలకు బహుమతుల ప్రదానం

కల్లూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయిలో మూడవ తరగతి చదువుతున్న చిన్నారులకు పలు రకాలుగా క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని పలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల నుంచి పాల్గొన్న క్రీడాకారులకు (చిన్నారులకు) పాఠశాల పూర్వ విద్యార్థి భమిడిపాటి రవికిషోర్‌శర్మ దంపతులు పలు పాఠశాలల నుంచి వచ్చిన చిన్నారులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పి. నివేదిత, క్రీడల నిర్వహణ కార్యదర్శి పి. వీరరాఘవయ్య, పీడీ భీమాతోపాటుగా పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎల్‌ఆర్‌ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కమిషనర్ వేణు

వైరా, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన ఎల్‌ఆర్‌ఎస్‌పై 25శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని వైరా మునిసిపల్ కమిషనర్ చింతా వేణు సూచించారు. వైరా ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ కార్తీక్‌తో కలిసి స్థానిక రియల్టర్లతో గురువారం మునిసిపల్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వం ప్రకటించిన ఎల్‌ఆర్‌ఎస్‌పై 25శాతం ఫీజు రాయితీ పొందడానికిగానూ పదిశాతం ప్లాట్లు అమ్ముడుపోగా మిగిలిన ఉన్న 90శాతం ప్లాట్స్‌కు ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ పొందేందుకు అవసరమైన నియమనిబంధనలను కమిషనర్ వేణు వివరించారు. లేఅవుట్లలో మిగిలిన ప్లాట్స్‌ను రిజిస్ట్రర్ చేసుకొని ప్రభుత్వ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లేఅవుట్ క్రమబద్ధీకరణకు అవసరమైన నియమనిబంధనలను వివరించారు. టౌన్‌ప్లానింగ్ అధికారి ఇటికాల భాస్కర్ పాల్గొన్నారు.

## ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి

» ఏఐకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు



అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన వెంగళరావు, వెంకటనర్సయ్య

చింతకాని, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం లో మిర్చి బోర్డు ఏర్పాటు చేసి క్వింటాకు రూ 25 వేలకు కొనుగోలు చేయాలని రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు భాగం హేమంతరావు డిమాండ్ చేశారు. గురువారం ఏఐకేఎస్ చింతకాని మండల 4వ మహాసభ మండల పరిధిలోని పొద్దుటూరు గ్రామంలో నిర్వహించారు. అనంతరం ఏఐకేఎస్ నూతనం అధ్యక్షుడిగా దొబ్బల వెంగళరావు, ప్రధాన కార్యదర్శిగా పదిమల వెంకటనర్సయ్యతో పాటు మరో మంది సభ్యులతో నూతన కమిటీ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జమ్ముల జితేందర్‌రెడ్డి, దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, ఏపూరి రవీంద్రబాబు, కూచిపూడి రవి, పావులూరి మల్లికార్జున్, దూసరి గోపాలరావు, బాలాజీ, బొడ్డు కొండలరావు, అజయ్ పాల్గొన్నారు.

## గొర్రె పొట్టేళ్ల పందాలు

ఎర్రుపాలెం మార్చి13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బనిగండ్లపాడులో మూడురోజులుగా జరుగుతున్న శ్రీ అంకమ్మతల్లి, అక్కమ్మ పేరంటాల రామలింగయ్య స్వామి తిరునాళ్ల సందర్భంగా గురువారం రెండురాష్ట్రాల గొర్రె పొట్టేళ్ల పందేలు హోరాహోరీగా జరిగాయి. ఈ మండలం రాష్ట్ర సరిహద్దుల్లో ఉండటంతో మం డల వాసులతో పాటు ఆంధ్రా ప్రాంతం వాసులు కూడా అధిక సంఖ్యలో ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఇరు రాష్ట్రాల పోటీలదారుల్లో ప్రథమ బహుమతి మండలానికి చెందిన రాజులదేవరపాడుకు చెందిన కోమటి రాజేష్ పొట్టేలుకు, ద్వితీయ బహుమతి ఎన్టీఆర్‌జిల్లా కొలికోల్ల గ్రామానికి చెందిన పెరుగు శివ, తృతీయ బహుమతి తొర్లపాడుకు పొట్టేలు గెలుచుకున్నాయి. గెలుపొందిన పొట్టేళ్ల యజమానులకు నగదు పారితోషికం అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆలయ పూజారి, కమిటీ సభ్యులు, వేమిరెడ్డి వెంకటరెడ్డి, దాతలు పాల్గొన్నారు.



తలపడుతున్న పొట్టేళ్లు

## మొక్కజొన్నలు కొనుగోలు చేయాలి

» తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్

వైరా, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న పంటను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ కోరారు. మండలంలోని తాటిపూడిలో గురువారం జరిగిన రైతుసంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 20వతేదీన వైరాలో జరిగే రైతు సంఘం జిల్లా మహాసభల్లో రైతులు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దొబ్బల కృష్ణ, కొండా రామకృష్ణ, బండారుపల్లి ముత్తయ్య, రవి, కృష్ణయ్య పాల్గొన్నారు.

## సబ్‌జైలర్, ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్ ?

సత్తుపల్లిరూరల్, మార్చి13 (ఆంధ్రజ్యోతి): విచారణ ఎదుర్కొంటున్న రిమాండ్ ఖైదీ పరారై పట్టుబడిన సంఘటనలో సబ్‌జైల్ సూపరింటెండెంట్‌తో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లను ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఈనెల 11వ తేదీ ఉదయం అశ్వారావుపేట మండలం ఆసుపాకకు చెందిన పెండ్ర రమేష్ జైలు నుంచి తప్పించుకుని ఆంధ్రాలోని ఎర్రగుంటపల్లి వద్ద బంధువుల ఇంట ఆదేరోజు మధ్యాహ్నం పట్టుబడ్డాడు. అదే రోజు జిల్లా సబ్‌జైళ్ల అధికారి బీ.వెంకటేశ్వర్లు, ఆ తర్వాతి రోజు జైళ్ల శాఖ వరంగల్ రేంజీ డీఐజీ ఎం.సంపత్‌లు విచారణ చేపట్టారు. విచారణ అనంతరం ఉన్నతాధికారులు సత్తుపల్లి సబ్ జైల ర్ సోమరాజు ప్రవీణ్, కానిస్టేబుళ్లు మారేశ్వరరావు, శ్రీనులను సస్పెండ్ చేసినట్లు తెలిసింది. కాగా ఈ విషయమై జైలు అధికారులను ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సత్తుపల్లిరూరల్, మార్చి13 (ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ హెడ్‌మాస్టర్ చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన ఖమ్మంలో చోటుచేసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంటకు చెందిన అగ్గి రవి (42) భార్య కవిత, ఇద్దరు పిల్లలతో సత్తుపల్లిలో నివాసం ఉంటూ, అశ్వారావుపేట మండలం భీమునిగూడెం పాఠశాలలో హెడ్‌మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి స్వగ్రామం ఎర్రగుంటకు సత్తుపల్లి నుంచి బయల్దేరిన రవి పట్టణంలోని వెంగళరావునగర్ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొనగా తీవ్రంగా గాయపడ్డాడు. సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య కవిత పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పాఠశాలల్లో హోలీ సంబురాలు



హోలీ సంబురాల్లో చిన్నారులు

మధిరటౌన్,మార్చి13: భరత్ కిడ్స్ స్కూల్‌లో గురువారం హోలీ సంబరాలు నిర్వహించారు. చిన్నారులు ఒకరికి ఒకరు రంగులు పూసుకుంటూ హోలీ సంబురాల్లో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు హోలీ పండగ విశిష్టత ను విద్యార్థులకు తెలియజేశారు, విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా రంగులు చల్లుకుని ఆనందోత్సహాలతో ముందస్తుగా పండుగను చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భరత్ విద్యాసంస్థల చైర్మన్ శీలం వెంకటరెడ్డి, డైరెక్టర్ విద్యాలత ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ నిరాహారదీక్ష

ముదిగొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మూడోరోజుకు చేరుకున్నాయి. కార్యక్రమంలో ఎల్.భద్రం, పడిశాల నాగేశ్వరరావు, కట్టకూరి సురేష్, నాగరాజు, రమేష్, నాగరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.



కల్లూరులో దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**వైరాలో...**

వైరా: ఏబీసీడీ ఎస్సీ వర్గీకరణ పూర్తయిన తర్వాతనే గ్రూపు-1,2,3 ఇతర ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ రెండోరోజు గురువారం వైరాలో ఎమ్మార్పీఎస్ రిలే నిరాహారదీక్షలు నిర్వహించింది. కోట కోటిమాదిగ, కరిశ రమేష్, మాగంటి బాబూరావు, కన్నెగంటి హుస్సేన్, చిన్న హుస్సేన్, పమ్మి తిరుమలరావు, నల్లగట్ల బాబు పాల్గొన్నారు.

**కల్లూరులో...**

కల్లూరు: ఎస్సీ వర్గీకరణకు ఏబీసీడీలుగా వర్గీకరించి అసెంబ్లీలో తక్షణమే చట్టం అమాలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ కల్లూరులో గురువారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలేనిరహార దీక్షలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆదూరి కిరణ్, వెంకటేశ్వర్లు, పుల్లారావు, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, కనకపూడి జయరాజు, కొరకొప్పు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**కొణిజర్లలో...**

కొణిజర్ల: ఎస్సీవర్గీకరణ చట్టం అయ్యేంతవరకు ఒక్క ఉద్యోగం ఇవ్వవద్దని కోరుతూ కొణిజర్ల మండలపరిషత్, తహసీల్దార్ కార్యాలయం ముందు ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన దీక్ష గురువారం మూడవరోజుకు చేరింది. ఈ దీక్షలను ఉద్దేశంచి ఎంఈఎఫ్ జిల్లా నాయకులు యాద గిరిమాదిగ మాట్లాడారు. ఈ దీక్షలో ఎంఎస్పీ మండల అధ్యక్షుడు చాట్ల భాస్కర్‌రావు మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి కొర్లకంటి రవికుమార్‌మాదిగ, మధుబాబు మాదిగ, మందా రవిమాదిగ, మాచర్ల సిల్వ రాజు మాదిగ, వివేక్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## మొల్లమాంబ జయంతి

వైరా, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వైరాలో గురువారం కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో తొలి కవి కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను నిర్వహించారు. మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుమ్మరి సంఘం నాయకులు గుమ్మడదల వెంకటనారాయణ, సంగెపు వెంకటేశ్వర్లు, పొట్టపల్లి వెంకటేశ్వర్లు, సంగెపు కృష్ణ, ఇనగంటి ప్రసాద్, విలాసాగరం నరేష్, దరిపల్లి మధు, గుడిమెట్ల రవి, బాడిశ రవి, చరణ్, రాంబాబు పాల్గొన్నారు.

## యోగా శిక్షణ

పెనుబల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆదియోగి పరమేశ్వర యోగా అకాడమీ ఆధ్వర్యంలో గురువారం లంకా సాగర్ పీహెచ్‌సీలో గర్భిణులకు యోగా గురువు చింతకింద రామకృష్ణ శిక్షణనిచ్చారు. లంకాసాగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, గ్రామస్థులు, పాల్గొన్నారు.

## సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు

వైరా, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లోని సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించాలని, ఈ స్థానిక సంస్థల్లోని ప్రజలకు పనైనా చూపించాలని లేకపోతే తిండి అయినా పెట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సు దర్శన్‌రావు డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యు డు తాళ్లపల్లి కృష్ణ అధ్యక్షతన గురువారం వైరాలో జరిగిన ఆపార్టీ డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైరా మునిసిపాలిటీకి ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించాలని, నియోజకవర్గ కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, సభ్యులు దిగ్గి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు, సుంకర సుధాకర్, మచ్చా మణి, చింతనిప్పు చలపతిరావు, చెరుకుమల్లి కుటుంబరావు, బాణాల శ్రీనివాసరావు, తోట నాగేశ్వరరావు, తూము సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలి'

కారేపల్లి, మార్చి13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రాథమిక స్థాయిలోనే ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని ఎస్‌ఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ హెచ్.రాజేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బ్రిలియంట్ స్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ఈకార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ మల్లెల నాగేశ్వరరావు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## టీబీ రహిత సమాజం కోసం కృషి చేయాలి

తల్లాడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): టీబీ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఐ.రత్నమనోహర్ కోరారు. గురువారం లక్ష్మీపురం గ్రామంలో టీబీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ వ్యాధి లక్షణాలు ఉన్న వారి నుంచి కళ్లె నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో టీబీ నోడల్ అధికారి కె.పెద్దపుల్లయ్య, సూపర్‌వైజర్లు వైసురేష్, సంజయ్‌కుమార్, ఏఎన్‌ఎం సుజాత, కార్యదర్శి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

## స్థానిక సమస్యలను పరిష్కరించాలి

» సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి

తల్లాడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న స్థానిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాదినేని రమేష్ డిమాండ్ చేశారు. గురువారం తల్లాడ మండలంలోని కుర్నవల్లి, మల్లవరం, గోపాలపేట గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఐనాల రామలింగేశ్వరరావు, నల్లమోతు మోహన్‌రావు, శీలం పకీరమ్మ, పేరసాని వెంకటయ్య, మేడి భిక్షం పాల్గొన్నారు.

## కళాకారుడు వెంకన్నకు భారత విభూషణ్ అవార్డు

చింతకాని, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమ జానపద గాయకుడు పాగి వెంకన్నకు విజన్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం భారత విభూషణ్ అవార్డు అందించి సత్కరించారు. 25 ఏళ్లుగా పల్లె పాటలకు ప్రాణం పోస్తున్న వెంకన్నను గుర్తించి అవార్డు అందజేయడాన్ని స్వాగతిస్తున్నట్లు జిల్లా, మండల కళాకారుల బృందం తెలిపింది. అవార్డు పొందిన వెంకన్న పలువురు కళాకారులు, గ్రామస్థులు అభినందించారు.



అవార్డు అందుకుంటున్న వెంకన్న